batukammanews.com
TEL/2019/78873

బతుకమ్మ

19 నవంబర్ 2026
గురువారం

తాజా వార్తల సద్దిమూట

ఏసీబీకి చిక్కిన సర్పంచ్

క్వారీ నిర్వాహకుల నుంచి
రూ.2 లక్షల లంచం
తీసుకుంటుండగా పట్టివేత

క్వారీ నిర్వాహణ సక్రమంగా జరుగాలంటే తనకు లంచం ఇవ్వాలని డిమాండ్ చేసి మొదటి విడత రూ.2 లక్షల లంచం తీసుకుంటున్న సర్పంచ్ ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

– మహబూబాబాద్, బతుకమ్మ



2 లో



అడవుల ఆక్రమణలపై
అటవీ శాఖ ఉక్కుపాదం

17 రోజుల్లో ముగ్గురు సిబ్బందిపై సస్పెన్షన్ వేటు

అటవీ భూములు కాపాడటంలో నిర్లక్ష్యంపై శాఖాపరమైన చర్యలు

జేసీబీల స్వాధీనం, చెట్ల నరికివేతపై కేసులు

కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి ఫారెస్టు రేంజ్ పరిధిలో అటవీ భూముల అన్యక్రాంతం ఆగడం లేదు. ఇటీవల పోడు కోసం అటవీ భూముల కబ్జాతో పాటు చెట్ల నరికివేత జోరుగా సాగింది. ఈ యేడాది ఎఫ్ఆర్ వోతో పాటు సెక్షన్ ఆఫీసర్లపై చర్యలు తీసుకున్నా అటవీ సంపదకు రక్షణ లేకుండాపోయింది. ఈ నేపథ్యంలో ఇటీవల కామారెడ్డి డీఎఫ్ వోగా బాధ్యతలు స్వీకరించిన నీరజ్ కుమార్ అటవీ భూముల ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతున్నారు. ప్రధానంగా అటవీ సంపదను కాపాడడంలో విఫలమైన అధికారులపై చర్యలకు ఉపక్రమించారు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి ఫారెస్ట్ రేంజ్ పరిధిలో అటవీ భూముల ఆక్రమణలు, చెట్ల నరికివేతలు, అక్రమ మొరం తవ్వకాల వ్యవహారాలపై జిల్లా అటవీ అధికారి నీరజ్ కుమార్ త్రిబ్రివాల్ వరుస తనిఖీలు చేపట్టారు. విధుల్లో నిర్లక్ష్యం వహించారనే ఆరోపణలపై 17 రోజుల వ్యవధిలో ముగ్గురు అటవీ సిబ్బంది సస్పెన్షన్‌కు గురయ్యారు. మరోవైపు లింగంపేట మండలంలోని శెట్పల్లి, ఎక్కపల్లి, ఎక్కపల్లి తండా, పర్మల్ల, జల్దిపల్లి ప్రాంతాల్లో అటవీ భూముల పరిరక్షణకు అధికారులు చర్యలు చేపట్టారు. నవంబర్ 12న 691 కంపార్ట్‌మెంట్‌లో 50 ఎకరాలు, నవంబర్ 17న 731 కంపార్ట్‌మెంట్‌లో 25 ఎకరాల ఆక్రమణలపై చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

– ఎల్లారెడ్డి, బతుకమ్మ



2



పీఏసీఎల్‌ల
పున:వ్యవస్థీకరణ

రాష్ట్రంలో కొత్తగా
240 పీఏసీఎస్‌ల
ఏర్పాటు

2 లో

తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయం, సహకార శాఖలు రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పున: వ్యవస్థీకరణకు అనుమతులు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 11న ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి రాష్ట్రంలో కొత్తగా 240 పీఏసీఎస్ ల ఏర్పాటు చేయడానికి సంబంధించిన ప్రతిపాదనలు తెలంగాణ సహకార సంఘాల చట్టం, 1964 దాని కింద రూపొందించిన నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకోవడానికి అనుమతి ఇచ్చింది. ఈ మేరకు వ్యవసాయ శాఖకు, సహకార శాఖకు సూచనలు చేస్తూ ఆదేశాలు వెలువరిం చింది.స్పెషల్ కమిషనర్ ఫర్ కోఆపరేషన్ , రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీస్, నివేదించిన పరిస్థితుల నేపథ్యంలో, ప్రభుత్వం ఆ నివేదికను జాగ్రత్తగా పరిశీలించిన అనంతరం, రాష్ట్రంలోని ప్రస్తుతం ఉన్న పీఏసీఎస్ లను పున: వ్యవస్థీకరించడం, కొత్తగా 240 పీఏసీఎస్ లను ఏర్పాటు చేయడం కోసం అవసరమైన తదుపరి చర్యలు తీసుకోవాలని స్పెషల్ కమిషనర్ ఫర్ కోఆపరేషన్, రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీస్ కి అనుమతి మంజూరు చేసింది.

– హైదరాబాద్, బతుకమ్మ

కస్తూర్బా విద్యాలయంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

మాక్లూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించారు. వంట గది, స్టోర్ రూంలో సరుకుల నాణ్యత తనిఖీ చేశారు.

– మాక్లూర్, బతుకమ్మ



2 లో

వైభవంగా శ్రీ లక్ష్మీనృసింహ స్వామివారి ఎదుర్కోలు

ప్రముఖ పుణ్యక్షేత్రమైన భీమ్ గల్ మండలం లింబాద్రిగుట్టపై శ్రీ లక్ష్మీనృసింహ స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీలక్ష్మీనృసింహస్వామి వారల ఎదురుకోలు కార్యక్రమంను అర్చకులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆనందం ఆనందం ఆయెనే.. మా లింబన్న పెళ్లి కొడుకాయెనే..”

– భీమ్ గల్, బతుకమ్మ



2 లో

కస్తూర్బా విద్యాలయంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

విద్యార్థినుల కోసం సిద్ధం చేసిన ఆహారాన్ని పరిశీలించి, మెనూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిరే శించిన మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టిక ఆహారాన్ని అందించాలని నిర్వాహకులను ఆదేశించారు. సరుకుల సరఫరా విషయంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే అధికా రుల దృష్టికి తేవాలని, స్టాక్ రిజిస్టర్ పక్కాగా నిర్వహిం చాలని సూచించారు. కాగా, గత కొన్ని రోజులుగా నిత్యా వసరాలలో కొన్ని రకాల సరుకులను కాంట్రాక్టర్ పంపక పోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్పెషల్ ఆఫీసర్ కలెక్టర్ దృష్టికి తేగా, ఎప్పటికప్పు డు నిత్యావ సరాల కోసం విద్యా శాఖ ద్వారా ప్రత్యేకంగా నిధులను అందజేయించారు. నిత్యావసరాలు సమకూర్చే కాంట్రాక్ట్ ఏజెన్సీని సంప్రదించి సరుకులు సక్రమంగా సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఏజెన్సీకి షో కాజ్ నోటీసులు ఇచ్చి బ్లాక్ లిస్టులో పెడతామని కలెక్టర్ హెచ్చరించారు.కాగా, బాలికల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, బయటి వ్యక్తులను లోనికి అనుమతించకూ డదని ఆదేశించారు. ఇంటర్ మీడియట్ విద్యార్థినులకు నీట్ కోచింగ్ అందిస్తుండ డం పట్ల కలెక్టర్ అభినంది స్తూ, అత్యధిక మందికి ప్రవేశాలు లభించేలా చూడాలని నిర్వాహకులకు సూచించారు. ఈ సందర్భంగా కేజీబీవీ



విద్యార్థినులతో కలెక్టర్ ఇలా త్రిపాఠి భేటీ అయ్యారు. వారి కి పలు ప్రశ్నలు వేస్తూ అభ్యాసన సామర్థ్యాన్ని అంచనా వేశారు. తన వెంట తెచ్చిన డైరీలు, చాక్లేట్లు, బహుమ తులను అందించారు. చక్కగా చదువుకోవాలని, అదే సమ యంలో వ్యక్తిగత భద్రత విషయంలో ఏమరుపాటుగా ఉండకుండా అనుక్షణం అప్రమత్తం గా వ్యవహరించాలని జాగ్రత్తలు సూచించారు. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ భుజంగరావు, ఇంచార్జి డీఈఓ సాయాగౌడ్, ఎంఈఓ సత్యనారాయణ, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ స్రవంతి తదితరులు ఉన్నారు.

ఏసీబీకి చిక్కిన సర్పంచ్

రాష్ట్ర ఏసీబీ చరిత్రలో తొలిసారి అవినీతి నిరోధక శాఖకు సర్పంచ్ పట్టుబడిన ఘటన బుధవారం మహబూబాబాద్ జిల్లా సిరోల్ మండలం మొదుగడ్డ తాండలో జరిగింది. మొదుగడ్డ తాండ సర్పంచ్ ధారావత్ వీరు తన పంచాయితీ పరిధిలో నిర్వహిస్తున్న శారద స్టోనెక్స్ ప్రీమియర్ గ్రానైట్, రాశీ గ్రానైట్ నిర్వాహకులను లంచం డిమాండ్ చేశారు. తనకు రూ.30 లక్షల లంచం ఇవ్వాలని లేకపోతే క్వారీ నిర్వాహణ జరుగదని బెదిరించారు. దానితో వారు బేరసారాలు సాగించగా రూ.13 లక్షలకు డీల్ కుదిరింది. దాంతో బాధితులు ఏసీబీని ఆశ్రయించారు. పంచాయితీ కార్యాలయం వద్ద వరంగల్ ఏసీబీ రేంజ్ అధికారులు ధారావత్ వీరు గ్రానైట్ నిర్వాహకుల నుంచి రూ.2 లక్షలు తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి వరంగల్ ఏసీబీ కోర్టు ముందు హాజరుపర్చగా న్యాయస్థానం రిమాండ్ విధించింది.

పీఏసీఎల్‌ల పున:వ్యవస్థీకరణ

రాష్ట్రంలో కొత్తగా 240 పీఏసీఎస్ ల ఏర్పాటు

ఆదిలాబాద్ జిల్లాలో ఆరు కొత్త పీఏసీఎస్ లు, భద్రాది కొత్తగూడెం జిల్లాలో 15, హన్మకొండ జిల్లాలో 3, జన గామ జిల్లాలో 2, జగిత్యాల జిల్లాలో 12, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 8, జోగులాంబ గద్వాల జిల్లాలో 4, కామారెడ్డి జిల్లాలో 6, ఖమ్మం జిల్లాలో 20, కొ మురంభీం అసిఫాబాద్ జిల్లాలో 3, మహబూబ్ నగర్ జిల్లాలో 5, నారాయణపేట్ జిల్లాలో 6, నిర్మల్ జిల్లాలో 14, మెదక్ జిల్లాలో 7, మెద్చల్ మల్కాజ్ గిరిలో 1, ము లుగు జిల్లాలో 5, నాగర్ కర్నూల్ జిల్లాలో 4, నల్గొండ జిల్లాలో 17, నారాయణపేట్ లో 3, నిజామాబాద్ జి ల్లాలో 5, పెద్దపల్లి 2, రాజన్న సిరిసిల్లా జిల్లా 5, రం గా ండ్డి 11, సంగారెడ్డిలో 10, సిద్దిపేట్ 10, సూర్యపేట్ జి ల్లాలో 10, వికారాబాద్ జిల్లాలో 15, వనపర్తి జిల్లాలో 6, వరంగల్ జిల్లాలో 4, యాదాద్రి భువనగిరి జిల్లాలో 8, కరీంనగర్ జిల్లాలో 7 పీఏసీఎల్ లు ఏర్పాటు కానున్నాయి.

అడవుల ఆక్రమణలపై అటవీ శాఖ ఉక్కుపాదం

ఎల్లారెడ్డి ఫారెస్ట్ రేంజ్‌లో సస్పెన్షన్‌ల పరంపర

ఎల్లారెడ్డి రేంజ్ పరిధిలో అటవీ భూముల ఆక్రమణపై ఇప్పటికే ఎఫ్ఆర్ వో సస్పెన్షన్ కాగా తాజాగా క్షేత్రస్థాయి అధికారులపై చర్యలకు ఉపక్రమించారు. సెప్టెంబర్ 3న డీఎఫ్ఓ నీరజ్ కుమార్ త్రిపాఠీ ఎక్కపల్లి అటవీ ప్రాంతాన్ని పరిశీలించారు. శెట్పల్లి, పర్మల్ల, ఎక్కపల్లి తండా పరిసరాల్లో చెట్ల నరికివేత, అటవీ భూముల ఆక్రమణలను అడ్డుకోవడంలో నిర్లక్ష్యం వహించారనే కారణంతో బీట్ ఆఫీసర్ శ్యాంసుందర్‌ను సస్పెండ్ చేశారు. బొల్లారం సెక్షన్ పరిధిలోని ఎక్కపల్లి తండా, ఎక్కపల్లి, పర్మల్ల, శెట్పల్లి అటవీ బీట్లలో ఆక్రమణలు, చెట్ల నరికివేతలను నిరోధించడంలో నిర్లక్ష్యంపై చర్య తీసుకున్నట్లు అప్పటి నివేదికలు తెలిపాయి. డీఎఫ్ఓ సిఫారసు మేరకు అనంతరం పీసీసీఎఫ్ స్థాయిలో బొల్లారం సెక్షన్ ఆఫీసర్ సెప్టెంబర్ 13న విక్కి మార్టిన్ సస్పెన్షన్‌కు గురయ్యారు.జల్లిపల్లి బీట్‌లోని 717, 720 కంపార్ట్‌మెంట్లలో అటవీ భూముల ఆక్రమణలు, చెట్ల నరికివేతలను అడ్డుకోవడంలో నిర్లక్ష్యంపై జల్లిపల్లి బీట్ ఆఫీసర్ శేఖర్‌రెడ్డిని సెప్టెంబర్ 17న సస్పెండ్ చేశారు. ఇలా 17 రోజుల వ్యవధిలో ఇద్దరు బీట్ ఆఫీసర్లు, ఒక సెక్షన్ ఆఫీసర్ సస్పెన్షన్‌కు గురికావడం ఎల్లారెడ్డి అటవీ రేంజ్‌లో అధికారుల పర్యవేక్షణపై చర్చకు దారితీసింది.

దాదాపు 200 ఎకరాల అటవీ భూమికి రక్షణ ఏర్పాట్లు

ఎల్లారెడ్డి ఫారెస్టు రేంజ్ పరిధిలోని లింగంపేట్ మండలం బొల్లారం ఫారెస్ట్ సెక్షన్ పరిధిలోని ఎక్కపల్లి తండా శివారులో 691 కంపార్ట్ మెంట్‌లో సుమారు 50 ఎకరాల అటవీ భూమిని ఆక్రమణల నుంచి స్వాధీనం చేసుకున్నారు. డీఎఫ్ఓ ఆదేశాలతో అధికారులు జేసీబీ ద్వారా కందకాలు తవ్వించి, భూమిని పరిరక్షించే చర్యలు చేపట్టారు. శెట్ పల్లి ఫారెస్ట్ బీట్‌లోని 722 కంపార్ట్ మెంట్‌లో సుమారు 15 ఎకరాలు, ఎల్లారెడ్డి మండలం లక్ష్మాపూర్ శివారులో సర్వే నంబర్ 27లో సుమారు 10 ఎకరాల అటవీ భూమి ఆక్రమణకు గురైనట్లు గుర్తించి అధికారులు కందకాలు తవ్వించారు. జల్లిపల్లి బీట్ పరిధిలోని లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన కొందరు సుమారు 25 ఎకరాల అటవీ భూమిని ఆక్రమించి సాగు చేసినట్లు అధికారులు గుర్తించి, రెండు జేసీబీలతో పంటలను తొలగించి భూమిని స్వాధీనం చేసుకున్నప్పటికీ కొద్దిరోజుల తర్వాత మళ్లీ వరి నాట్లు వేశారు. ఎక్కపల్లి అటవీ ప్రాంతంలో చెట్ల నరికివేత, అటవీ భూమి ఆక్రమణ ప్రయత్నానికి సంబంధించి ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. శెట్పల్లి అటవీ ప్రాంతంలో అక్రమంగా మొరం తవ్వుతున్న జేసీబీని అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సమయంలో అధికారుల విధులకు ఆటంకం కలిగించారనే ఫిర్యాదుపై పర్మల్లకు చెందిన వ్యక్తిపై పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేశారు. శెట్పల్లి, బొల్లారం, జల్లిపల్లి ప్రాంతాల్లో జరిగిన పరిణామాలను వివరించింది. 717, 720 కంపార్ట్ మెంట్లలో ఆక్రమణలు, తిమ్మారెడ్డి, రత్నాపూర్, కొక్కొండ ప్రాంతాల్లో ఆక్రమణలు జరిగినట్లు గుర్తించారు.

అంగరంగ వైభవంగా శ్రీ లక్ష్మీనృసింహ స్వామివారి ఎదుర్కోలు

అంటూ భక్తుల జయజయధ్వానాలు, మంగళవాయిద్యాల నడుమ గుట్టపై పండుగ వాతావరణం నెలకొంది. కళ్యాణ మహోత్సవంలో అత్యంత విశిష్ట ఘట్టమైన ఎదుర్కోలు వేడుక కోసం స్వామివారి ఉత్సవ విగ్రహాలను స్వర్ణాభరణాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. పుష్పమాలికలతో అలంకరించిన పల్లకిలో మంగళవాయిద్యాల నడుమ గర్భాలయం నుంచి కళ్యాణ మండపానికి తీసుకొచ్చారు. అనంతరం స్వామివారిని అశ్వవాహనం కూర్చోబెట్టి, అలంకరించి, కళ్యాణ మండపం నుంచి పుష్కరిణి పురవీధుల మీదుగా ఊరేగింపుగా శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం వద్దకు చేర్చారు. అదే సమయంలో శ్రీ లక్ష్మీ అమ్మవారిని పల్లకీలో స్వామివారి సన్నిధికి తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుక్కా గులాలు చల్లుకుంటూ శ్రీ లక్ష్మీనృసింహ స్వామివారికి, అమ్మవారికి సంప్రదాయబద్ధంగా ఎదుర్కోలు నిర్వహించారు. ఈ వేడుకలో అర్చకులు, వారి కుటుంబ సభ్యులు బుక్కా గులాలు చల్లుకుంటూ ఆనందోత్సాహాలతో నృత్యాలు చేశారు . స్వామివారి పల్లకి ముందు భక్తులు చేసిన నృత్యాలు, భజనలు వేడుకకు మరింత శోభను తీసుకొచ్చాయి.“గోవింద నీ నామమెంతో రుచిరా..” అంటూ భక్తులు ఆలపించిన కీర్తనలు గుట్ట పరిసరాలను ఆధ్యాత్మిక భక్తిరసంతో నింపాయి. స్వామివారి ఎదుర్కోలు వేడుకను తిలకించేందుకు భీమ్ గల్ పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామివారి కల్యాణ మహోత్సవానికి ముందు నిర్వహించిన ఈ ఎదుర్కోలు వేడుకతో లింబాద్రిగుట్ట భక్తి, ఆనందోత్సాహాల నిలయంగా మారింది.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు ప్రక్రియకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



అర్హత కలిగిన అన్ని కుటుంబాలకు పథకం వర్తించేలా చర్యలు

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి

నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు ప్రక్రియ ఈ నెల 19వ తేదీ నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం సాయంత్రం మాక్లూర్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నమోదు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సంద ర్భంగా నమోదు కేంద్రంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్, కంప్యూటర్, ఆన్‌లైన్ సదుపాయాలు, అందుబాటులో ఉన్న సిబ్బంది తదితర ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. బీమా పథకం నమోదు ప్రక్రియకు సంబంధించి ఆపరే టర్‌ను పలు ప్రశ్నలు అడిగి, వివరాల నమోదు విధానం, అవసరమైన పత్రాలు, ఆన్‌లైన్‌లో నమోదు చేసే విధానం తదితర అంశాలపై సన్నద్ధతను తెలుసుకున్నారు.నమోదు ప్రక్రియలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని, సంబంధిత అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచిం చారు. లబ్ధిదారుల వివరాల నమోదులో ఎలాంటి తప్పి దాలు జరగకుండా అత్యంత జాగ్రత్తగా వ్యవహ రించాలని, నమోదు చేసిన వివరాలను సరిచూసుకున్న తర్వాతే ఆన్లైన్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా స్థానిక మీడియా ప్రతినిధులతో కలెక్టర్ మాట్లాడుతూ, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలి పారు. ఈ నెల 19వ తేదీ నుంచి నిజామాబాద్ నగర పాలక సంస్థతో పాటు బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్ మున్సి పల్ కార్యాలయాలు, జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లోని గ్రామ పంచాయతీలలో ప్రత్యేక నమోదు శిబి రాలు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. వీటిని క్రమంగా అన్ని గ్రామ పంచాయతీలు, వార్డులకు విస్తరిం పజేస్తామని తెలిపారు. ప్రజలు ఎలాంటి ఆందోళనకు



గురికావాల్సిన అవసరం లేదని, జిల్లాలో అర్హత కలిగిన అన్ని కుటుంబాలకు ఈ పథకం వర్తించేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆహార భద్రత కార్డు కలిగి ఉన్న వారు జిల్లాలో ఎక్కడి నుంచైనా తమ వివరాలను నమోదు చేసుకునే వెసులుబాటు ఉం దని కలెక్టర్ తెలిపారు. అయితే బీమా చేయించుకునే వ్యక్తి మాత్రం నమోదు శిబిరానికి భౌతికంగా హాజరై సం తకం చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. నామినీలు నమోదు కేంద్రానికి వ్యక్తిగతంగా హాజరు కావాల్సిన అవ సరం లేదని, ఒకరి కంటే ఎక్కువ మంది నామినీలను ఎంపిక చేసుకునే వెసులుబాటు కూడా ప్రభుత్వం కల్పిం చిందని తెలిపారు. నామినీల పేర్లు కూడా సంబంధిత ఆహార భద్రత కార్డులో నమోదై ఉండాలని సూచిం చారు.ఆహార భద్రత కార్డు లేని వారు తమ ఆధార్ కార్డును వెంట తీసుకుని నమోదు శిబిరానికి రావాలని కలెక్టర్ సూచించారు.

ప్రతి నాలుగు శిబిరాలకు ఒక సూపర్ వైజర్

ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నమోదు ప్ర క్రియ సజావుగా కొనసాగేందుకు ప్రత్యేక పర్యవేక్షణ వ్యవ స్థను ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. ప్రతి నాలుగు నమోదు శిబిరాలకు ఒక సూపర్వైజర్‌ను నియమిం చామని, వీరితో పాటు మండల స్పెషల్ ఆఫీసర్లు, ఇతర సంబంధిత అధికారులు కూడా నిరంతరం పర్యవేక్షణ చేస్తూ సమన్వయంతో పనిచేస్తారని వెల్లడించారు. నమో దు ప్రక్రియలో ప్రజలకు అవసరమైన సహాయాన్ని అం దించడంతో పాటు, వివరాల నమోదులో తప్పిదాలు జర గకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ ఆదేశించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి పథకం ప్ర యోజనం అందేలా సమర్థవంతంగా పనిచేయాలని సూ చించారు.కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ భుజంగరావు, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, మండల స్పెషల్ ఆఫీసర్ కృష్ణ వేణి, ఇంచార్జి డీపీఓ నాగరాజు, సర్పంచ్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ వేంకటేశ్వర్లు, తహసీల్దార్ శేఖర్, పీఏసీఎస్ చైర్మన్ అశోక్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి

ఏర్గట్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శివన్నోళ్ల శివకుమార్ పిలుపు



ఏర్గట్ల,బతుకమ్మ: తెలంగాణ ప్రజా ప్రభుత్వం నూత నంగా ప్రారంభించనున్న ఇందిరమ్మ కుటుంబ భీమా పథకం,చేయూత పింఛన్లు, మహిళకు ఇందిరమ్మ చీరాల పంపిణీ పథకాల గురించి ఏర్గట్ల మండల పరిధిలోని గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు పార్టీ కార్యకర్తలకు ఏర్గట్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శివన్నోళ్ల శివకు మార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శివన్నోళ్ల శివకుమార్, మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సోమా దేవరెడ్డి, లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ,అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నాయకు లకు కార్యకర్తలకు సూచించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల అమలులో భాగం గా చేపడుతున్న మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 500/కే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇండ్లు, 200, యూనిట్ల ఉచిత విద్యుత్, సన్నం బియ్యం,రేషన్ కార్డులు,రైతు బరోసా,ఐకేపీ మహిళకు జీరో వడ్డీ రుణాలు,రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా10 లక్షల రూపాయల వరకు వైద్యసేవలు, యువతకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు వంటి పథకాల గురించి ప్రజలకు వివరించాలని తెలిపారు.అలాగే ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి,విద్యా, వైద్య రంగాల్లో చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు తెలియజే యాలన్నారు. గ్రామాలలో జరుగుతున్న అభివృద్ధిలను గ్రామసభలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేయాలని, పిలుపునిచ్చారు.రెండు మూడు రోజుల్లో ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని తెలంగాణ ప్రజా ప్రభుత్వం ప్రారంభించనున్నట్లు.ఈ పథకం ద్వార కుటుంబ పెద్ద మరణించినట్లయితే 5 లక్షల జీవిత బీమాను ప్రభుత్వం కల్పించనున్నట్లు తెలిపారు.ఇలాంటి పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ వచ్చేటట్లు అప్లికేషన్ పెట్టించే బాధ్యత తీసుకోవాలని ఇలాంటి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లిపార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. ఇప్పటివరకు నూతనంగా ఏర్గట్ల మండల పరిధిలోని గ్రామాలకు 371 పెన్షన్లు వచ్చినవి,ఇంకా అర్హత ఉండి పెన్షన్లు రాని వారి వివరాలు తీసుకొని జిల్లా ఇంచార్జీ మంత్రి ధనసరి సీతక్క,బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ దృష్టికి తీసుకవెళ్లి పెన్షన్లు మంజూరు చేయడం జరుగుతుందని ఏర్గట్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శివన్నోళ్ల శివకుమార్ అన్నారు.ఇట్టి సమావేశంలో మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు,సర్పంచులు, ఉపసర్పంచులు,సొసైటీ చైర్మన్,మాజీ కేఎంసీ డైరెక్టర్, ఆలయ కమిటీ చైర్మన్,ఇందిరమ్మ కమిటీ సభ్యులు,గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లింబాద్రిగుట్ట జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు

ఫ్రీ పార్కింగ్, వన్‌వే ట్రాఫిక్ అమలు

భక్తులు పోలీసులకు సహకరించాలి

భీమ్ గల్, బతుకమ్మ : మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన లింబాద్రిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి జాతర నేపథ్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలీసు, రెవెన్యూ యంత్రాంగం సమన్వయంతో పకడబంది ఏర్పాట్లు చేస్తున్నట్లు భీమ్ గల్ సీఐ సత్యనారాయణ తెలిపారు. బుధవారం ఆలయ ధర్మకర్త నంబి పార్థసారథి, మండల అధికారులతో కలిసి నిర్వహించిన ప్రెస్ మీట్ లో జాతర ఏర్పాట్ల వివరాలను వెల్లడించారు. గతేడాది జాతరలో విజయవంతమైన వన్‌వే ట్రాఫిక్ విధానాన్నే ఈసారి కూడా అమలు చేయనున్నట్లు సీఐ తెలిపారు. లింగాపూర్ చౌరస్తా మీదుగా వాహనాలు వచ్చి భీమ్ గల్ వైపు వెళ్లేలా ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. జాతర సమయంలో రహదారులపై వాహనాల రద్దీని నియంత్రించి, భక్తులు సురక్షితంగా ఆలయానికి చేరుకునేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు పేర్కొన్నారు.గతేడాది టోల్ వసూళ్ల కారణంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తిన నేపథ్యంలో ఈసారి టోల్ విధానాన్ని పూర్తిగా రద్దు చేసినట్లు ప్రకటించారు. భక్తులకు ఉచిత పార్కింగ్ సౌకర్యం కల్పించడంతో పాటు ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాల కోసం ప్రత్యేకంగా నాలుగు పార్కింగ్ లాట్లను సిద్ధం చేసినట్లు తెలిపారు. వాహనదారులు తమ వాహనాలను కేటాయించిన పార్కింగ్ ప్రదేశాల్లోనే నిలిపి పోలీసులకు సహకరించాలని కోరారు. అదేవిధంగా భక్తులకు త్వరితగతిన స్వామివారి దర్శనం కల్పించేందుకు వీఐపీ టికెట్లు, ప్రత్యేక పాస్‌ల విధానాన్ని రద్దు చేసినట్లు వెల్లడించారు. గతంలో వీఐపీ దర్శనానికి వినియోగించిన మార్గాన్ని ఈసారి సర్వదర్శనం ఎగ్జిట్ మార్గంగా ఉపయోగించనున్నట్లు తెలిపారు. దీనివల్ల దర్శనం అనంతరం భక్తులు సులభంగా



బయటకు వెళ్లేందుకు అవకాశం ఉంటుందన్నారు. జాతర సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, భక్తుల రాకపోకలు, క్యూలైన్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. పోలీసు సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటూ భద్రతా చర్యలు పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. భక్తులు పోలీసుల సూచనలు పాటిస్తూ, ట్రాఫిక్ నిబంధనలకు సహకరించి జాతరను ప్రశాంతంగా నిర్వహించేందుకు తోడ్పడాలని సీఐ సత్యనారాయణ కోరారు.

ఈ మిడిల్ క్లాస్ జీవితం వద్దు

అప్పుల భాధతో దంపతులు ఆత్మహత్య

పెంపుడు కుక్కను చంపి భార్య భర్త ల బలవన్మరణం

కంట తడి పెట్టిస్తున్న సూసైడ్ నోట్



వెబ్ డెస్క్, బతుకమ్మ : వరంగల్ రంగశాయిపేటలో విషాదం నెలకొంది. నల్లపోగుల సంజయ్ కుమార్ (60), శోభ (53) దంపతుల ఆత్మహత్యకు పాల్పడ్డారు. మహిళా టైలర్ వద్ద రూ.50 వేల అప్పు తీసుకున్న దంపతులు వారానికి రూ.750 చొప్పున వడ్డీ చెల్లించినట్లు సూసైడ్ నోట్‌లో వెల్లడించారు. వడ్డీ చెల్లింపులో ఆలస్యంపై అవమానించిందని లేఖలో దంపతులు ఆరోపించారు. ఆర్థిక ఇబ్బందులు, అప్పుల వేధింపులే ఆత్మహత్యకు కారణమని ప్రస్తావించారు. ఆత్మహత్యకు ముందు పెంపుడు కుక్కనూ చంపేసిన దంపతులు, తమ అంత్యక్రియలను పెంపుడు కుక్క అంత్యక్రియలతో కలిపి నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. సూసైడ్‌నోట్ ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు పోలీసులు చేస్తున్నారు.

నిజాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి సాగునీటిని విడుదల చేయాలి

రైతుల ప్రయోజనాల దృష్ట్యా మాజీ

ఎమ్మెల్యే హన్మంత్ షిండే డిమాండ్

జుక్కల్, బతుకమ్మ : యాసంగి పంటల సాగు కోసం నిజాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి వెంటనే సాగు నీటిని విడుదల చేయాలని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే ప్రభుత్వాన్ని డీమాండ్ చేశారు. యాసంగి సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులు పంటల సాగుకు సిద్ధమవుతున్నారని, వారికి సాగునీటి కొరత లేకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా నిజాం సాగర్ ప్రధాన కాలువ ద్వారా 9వ డిస్ట్రిబ్యూటరీ వరకు సాగునీటిని సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. నీటి విడుదలలో జాప్యం జరిగితే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉంటుందని పేర్కొన్నారు. రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకొని





అధికారులు, ప్రభుత్వం వెంటనే స్పందించి యాసంగి పంటలకు అవసరమైన సాగునీటిని విడుదల చేయాలని మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో మాజీ జిల్లా జడ్పీ చైర్మన్ దపెదర్ రాజు, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు,మండల మాజీ ఎంపీపీ, మాజీ సర్పంచ్ లు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోకాళ్లపై నిల్చోని కార్మికుల నిరసన



నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏడవ రోజు నిరసనలో భాగంగా జిజిహెచ్ ముందు కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పి.సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ పేషెంట్ కేర్ సెక్యూరిటీ విభాగంలో పనిచేస్తున్న వారికి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో భాగంగా కార్మికులందరికీ కనీస వేతనం 26 వేల రూపాయలు పెంచాలని, ఆయన డిమాండ్ చేశారు. అలాగే కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రతినెల 1వ తేదీన కార్మికుల ఖాతాకు జీతాలు జమ చేయాలని, పండుగ, జాతీయ, సెలవులు ,మెటర్నిటీ సెలవులు ఇవ్వాలని కోరారు.ఈ నిరసన కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు భాగ్యలక్ష్మి, కవిత, భారతి, వెంకటేష్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై రాజీలేని పోరాటాలు

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వహక

అధ్యక్షులు రామకృష్ణ

నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : విద్యారంగ సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తామని, శాస్త్రీయ విద్యా విధానానికై పోరాటాల నిర్వహిస్తామని. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షులు ఇటికాల రామకృష్ణ. ప్రభుత్వం డిమాండ్ చేశారు. బుధవారం ఖానాపూర్ లోని రైస్ మిల్ ఫిట్టర్స్ యూనియన్ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా గర్ల్స్ మూడవ కన్వెన్షన్ సూచికగా ఏఐఎస్ఎఫ్ శ్వేత అరుణ పతాకాన్ని రాష్ట్ర ఉపాధ్యక్షులు బానోతు రఘురాం ఆవిష్కరించారు. అనంతరం సభను ఉద్దేశించే ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం భారతదేశ విద్యారంగం సంక్లిష్ట స్థితిని ఎదుర్కొంటుందని రామకృష్ణ పేర్కొన్నారు. పోరాటాలు మార్గమే సమస్యలకు పరిష్కారం చూపుతాయన్నారు. విద్య కేంద్రీకరించి పేద విద్యార్థులకు విద్యను అందుబాటులోకి తీసుకురావాల్సిన కేంద్ర ప్రభుత్వమే ప్రభుత్వ విద్యను నిర్వీరం చేస్తూ ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలను ప్రోత్సహిస్తుందని ఆయన అన్నారు. ఇప్పటికే విద్యను విభజించి, ప్రైవేటీకరణ కార్పొరేటీకరణ కాషాయకరణ కమర్షియలైజేషన్ చేసిందన్నారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పరుగులు పెడుతున్న నేటి తరుణంలో మతోన్మాదాన్ని చాందసవాదాన్ని పసి మెదడులో చూపించే ప్రయత్నం బిజెపి ఆర్ఎస్ఎస్ చేస్తుందన్నారు. శాస్త్రీయ విద్యా విధానం అమలకై విద్యార్థులు పోరాటాల నిర్వహించాలన్నారు. భారత ఎన్నికల సంఘం ప్రధాన కమిషన్ జ్ఞానేశ్ కుమార్ బిజెపి ఏజెంటా వ్యవహరిస్తూ ఏకపక్ష నిర్ణయాలతోని సర్ ప్రక్రియ ద్వారా దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లు తొలగించడం రాజ్యాంగం ప్రజాస్వామ్యస్ఫూర్తికి విరుద్ధమన్నారు. ఇంటర్మీడియట్ విద్య వ్యవస్థను రద్దు చేసే ఆలోచనను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలన్నారు రాష్ట్రంలో దశాబ్దాలుగా కొనసాగుతున్న ఇంటర్మీడియట్ విద్యా విధానాన్ని రద్దు చేసి పాఠశాల విద్యాశాఖలో వీలినం చేయడం అంటే పేద విద్యార్థులను విద్యకు దూరం చేయడమేనని ఆయన ప్రశ్నించారు.



అనంతరం ఏఐఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా గర్ల్స్ మూడవ మహాసభలో నూతన సమితి ఎన్నిక చేశారు. గర్ల్స్ కన్వీనర్ గా కీర్తన, కో కన్వీనర్ గా హాసిని తోపాటు 22 మంది నూతన సమితిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు శుభోదు, జిల్లా ఆఫీస్ బేరర్స్, కుశాల్,కిషోర్ చరణ్, సన్ని, అనూష, వినిత, నిహారిక, సిరి, చందన, సాత్విక, పల్లవి, సంజన, సుగంది, నిత్య, అక్షయ, మనోజ, నాగేష్, ఆకాష్, విష్ణు, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్ ప్రెస్ బస్సు ఆపే విధంగా చొరవ చూపాలి

గ్రామ పాలకవర్గం, గ్రామ ప్రజలు

ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ వినత

సదాశివనగర్, బతుకమ్మ : కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండల్ భూంపల్లి– లింగంపల్లి స్టేజి వద్ద ఆర్టీసీ ఎక్స్ ప్రెస్ బస్సులను ఆపాలని కోరుతూ భూంపల్లి గ్రామ పాలకవర్గం, గ్రామ ప్రజలు ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ మూర్తికి వినతిపత్రం అందజేశారు. లింగంపల్లి స్టేజి వద్ద ఎక్స్ ప్రెస్ బస్సులు ఆపకపోవడంతో చుట్టుపక్కల గ్రామ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు ముఖ్యంగా ఉన్న భూంపల్లి లింగంపల్లి జనగాం కరట్లపల్లి తిమ్మజివాడి తుక్కుజివాడి గ్రామాల ప్రజలు రాకపోకలు ఇబ్బందులు పడుతున్నారని భూంపల్లి గ్రామ సర్పంచ్ గైని శ్రీనివాస్ తెలిపారు ప్రయాణికులకు ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని లింగంపల్లి స్టేజి వద్ద ఎక్స్ ప్రెస్ బస్సులను ఆపేలా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ మూర్తి ను కోరారు. పల్లె వెలుగు బస్సులు కూడా కామారెడ్డి నుండి బాన్సువాడకు – బాన్సువాడ నుండి కామారెడ్డి కి వెళ్లే ఆర్టీసీ బస్సులు కూడా స్టేజీల వద్ద ఆపడం లేదని గత రెండు వారాలుగా కామారెడ్డి ఆర్టీసీ డివిఎం దినేష్ కుమార్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా పల్లె వెలుగు బస్సులు, ఎక్స్ ప్రెస్ బస్సులను లింగంపల్లి స్టేజి వద్ద రిక్వెస్ట్ బస్ స్టాప్ ఏర్పాటు చేయాలని గ్రామపంచాయతీ పాలకవర్గం గ్రామ ప్రజలు కోరారు. కామారెడ్డి ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ మూర్తి సానుకూలంగా స్పందించి పల్లె వెలుగు బస్సు ఎక్స్ ప్రెస్ బస్సు లింగంపల్లి స్టేజి వద్ద ఆపే విధంగా చొరవ చూపుతానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పాలకవర్గం గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

భీమ్ గల్, బతుకమ్మ : పేద కుటుంబాల్లోని ఆడపడుచుల పెళ్లిళ్లకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కళ్యాణలక్ష్మి పథకాన్ని అమలు చేస్తోందని ముచ్కూర్ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు గట్టు మురారి అన్నారు. బుధవారం ముగ్గురు లబ్ధిదారులకు కళ్యాణి లక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయక త్వంలోని ప్రజా ప్రభుత్వం పేద కుటుంబాల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు. భీమ్ గల్ మండలంలోని ముచ్కూర్ గ్రామానికి చెందిన ముగ్గురు లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి పథకం కింద ఒక్కొక్కరికి రూ.1,00,116 చొప్పున మొత్తం రూ.3,00,348 విలువైన చెక్కులు మంజూరయ్యాయని తెలిపారు.లబ్ధిదారులైన సబ్బని కావ్య (శ్రీనివాస్), జంగం అఖిల (లింగాగౌడ్), ములుగు లయ (లక్ష్మపతి) లకు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. పేదింటి ఆడపడుచుల వివాహాలు తల్లిదండ్రులకు ఆర్థిక భారం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం కళ్యాణలక్ష్మి పథకం ద్వారా అండగా నిలుస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీనివాస్, ఉపసర్పంచ్ రమేష్, యూత్ కాంగ్రెస్



మండల అధ్యక్షుడు బద్ది అవినాష్, కార్యదర్శి సంజయ్, జీపీవో గంగాధర్, కొరడి రాజు, కొరడి లింబాద్రి, డిష్ అశోక్, సొసైటీ వైస్ చైర్మన్ బోల్ట్ గంగారెడ్డి, మంద భూమేష్, బసిరి రాజు, కొడిగేల రాజన్న తదితర కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మంచినీటి సమస్య శాశ్వతంగా పరిష్కరించాలి



నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : ఆర్ జి కె రాజ గృహకల్ప అపార్ట్ మెంట్స్ లో మంచినీటి సమస్య శాశ్వతంగా పరిష్కరించాలి అని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రమేష్ బాబు, వ్యవసాయ కార్మిక సంఘం పెద్ది వెంకట రాములు, యుటియుసి రాష్ట్ర నాయకులు కటారి రాములు లు అధికారులను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజీవ్ గృహకల్ప అపార్ట్ మెంట్స్ లో జరుగుతున్న అక్రమాలపై మాట్లాడిన వారిపై కొందరు దాడి చేస్తున్నారని, ఇక్కడ కొంతమంది సొంతింటి వారమని రౌడీ గ్యాంగ్ ఇంటి కిరాయిలు, బోర్ రిపేర్ డబ్బు లు వసూలు చేస్తున్నారన్నారు. శివరాజు, సుబ్బు, కటోల లక్ష్మి, బేబీలు అపార్ట్ మెంట్లో రౌడీయిజం చేస్తూ పేద ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ దాడులు చేస్తూ బలవంతంగా డబ్బులు వసూలు చేస్తున్నారని అన్నారు. ముఖ్యంగా ఇంటికిరాయి 300 రూపాయలు, బోరు రిపేర్ మీద 500 రూపాయలు చొప్పున టోటల్ అపార్ట్ మెంట్లో 110 కుటుంబాలు నివాసం ఉంటున్నాయని, అందులో 63 కుటుంబాల దగ్గర గత ఆరు నెలలుగా 500 రూపాయల చొప్పున వసూలు చేస్తున్నారన్నారు. మిగతా వారి దగ్గర 100 నుంచి 300 వరకు వసూలు చేశారని వీరిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బస్తీ వాసులు నా యకుల ముందుకు వచ్చి నిర్భయంగా డబ్బులు వసూలు చేస్తున్న వారి పేర్లు చెప్పారన్నారు. ప్రజల అభిప్రాయం మేరకు కొత్త కమిటీ ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఆఫీస్ బేరర్స్ గా బాబు, జుబేర్, రవి, సురేష్, తయ్యబ, పటాన్, ప్రకాష్, కమిటీ సభ్యులు ఫారూఖ్ ,లలిత, సుశీల, గంగాధర్, కమిటీ అధ్యక్షులు బి సుజాత, కార్యదర్శి శ్రీదేవి లు ఎన్నికయ్యారు.

రామ్ మఠం భూముల్లో బస్సు డిపోకు కౌలు రైతుల వ్యతిరేకత



నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని న్యాల్కల్ రోడ్డులో ఉన్న రామ్ మఠానికి చెందిన భూముల్లో బస్ డిపో నిర్మాణానికి ఆర్టీసీ, రెవెన్యూ అధికారులు సర్వే చేస్తుండడాన్ని రైతులు తీవ్రంగా వ్యతిరేకించారు. బుధవారం ఆర్టీసీ, రెవెన్యూ అధికారులు భూమిని కొలవడానికి రాగా, సమాచారం తెలుసుకున్న రైతులు అక్కడికి చేరుకొని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ “గత 100 సంవత్సరాలకు పైగా మఠానికి ఎకరానికి 5 వేల రూపాయలు కౌలు చెల్లిస్తూ మేము ఈ భూములను సాగు చేసుకుంటున్నామన్నారు. ఎస్సీ, బీసీ, ఇతర కులాలకు చెందిన భూమిలేని రైతులు 140 సంవత్సరాలుగా ఈ భూములపై ఆధారపడి జీవనం సాగిస్తున్నామని తెలిపారు. “ఇప్పుడు ఉన్నట్టుండి మా భూములను లాక్కొని బస్ డిపో పెడతామంటే మా పొట్ట కొట్టినట్టేనని, రైతుల నోట్లో మట్టి కొట్టొద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో ముత్యాల సర్సారెడ్డి, ఆకుల శ్రీనివాస్, కొత్త రవి, సంపత్, శుభం చందు, బగ్గాలి శివ, బగాలి రాజు, గుప్త రవి, కొత్త రవి, అంబదాస్ రావు, లింగం, శివ కుమార్ తదితరులు పాల్గొని ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

జిల్లా స్థాయి వ్యాసరచన,
క్విజ్ పోటీల నిర్వహణ
సందర్శించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి



నిజామాబాద్ అర్బన్ , బతు కమ్మ : ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాధాన్యతపై విస్తృత స్థాయిలో అవగాహన పెంపొందించేందుకు వీలుగా ఎలక్టోరల్ లిటరసీ క్లబ్ కాంపిటీషన్స్--2026లో భాగంగా జిల్లా స్థాయి వ్యా సరచన, క్విజ్ పోటీలను బుధవారం సమీక్షిత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హా ల్లో నిర్వహించారు. అసెంబ్లీ నియోజకవర్గాల స్థాయిలో నిర్వహించిన పోటీలలో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికైన వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన 120 మంది విద్యార్థినీ, విద్యార్థులు ఈ పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి కాన్ఫరెన్స్ హాల్ ను సందర్శించి పోటీల నిర్వహణ తీరును పరిశీలించారు. విద్యార్థుల్లో ఎన్నికల ప్రక్రియ, ప్రజాస్వామ్య వ్యవస్థ, ఓటు హక్కు, ఎన్నికల ప్రాముఖ్యతపై అవగాహన పెంపొందించడంతో పాటు, బాధ్యతాయుతమైన ఓటర్లుగా తీర్చిదిద్దే ఉద్దేశంతో ఎలక్టోరల్ లిటరసీ క్లబ్ కాంపిటీషన్స్--2026ను నిర్వహిస్తున్నట్లు ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. పోటీలను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజు, సంబంధిత అధికారులున్నారు.

ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన డిఎంహెచ్ఓ

ఇందూర్, బతుకమ్మ : నగరంలోని గౌతమ్ నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి రాజశ్రీ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని, టీకాల అర్హుల జాబితా లిస్టును, సెషన్ ప్లాన్ , డ్రాప్ అవుట్ పిల్లల జాబితాను, పరిశీలించి వంద శాతం వ్యాధినిరోధక టీకాలను ఇవ్వాలని అన్నారు. తప్పిపోయిన ప్రతి పిల్లాడిని ఆశ వ్యక్తిగతంగా పర్యవేక్షించి టీకాలు ఇవ్వాలి అన్నారు. డి ఫ్రీజర్, ఐఎల్ఆర్ ను చూసి, కోల్డ్ చైన్ నిర్వహిస్తూ, టెంపరేచర్ రికార్డు చేయాలన్నారు. ఆసుపత్రిలో జరిగే ప్రసవాలు, గర్భిణీ స్త్రీల నమోదు రిజిస్టరు, ప్రమాదకర లక్షణాలు గల గర్భిణీ స్త్రీల రికార్డులను పరిశీలించి 100 శాతం ఆస్పత్రి ప్రసవాలు జరగాలని, ప్రమాదకర లక్షణాలు గల గర్భిణీ స్త్రీలను ముందుగానే ఉన్నత ఆసుపత్రులకు రిఫర్ చేయాలన్నారు. సర్వైకల్ క్యాన్సర్ నియంత్రణకు 14 ఏళ్ల బాలికలకు హెచ్పీవీ టీకాలను అర్హులైన బాలికలు అందరికీ ఇవ్వాలని, తల్లిదండ్రులకు టీకాపై అవగాహన కలిగించాలని, పెండింగ్ లో ఉన్న టీకాలను మూడు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన మహిళలందరికీ ఆరోగ్య మహిళ ద్వారా జీవనశైలి వ్యాధుల నియంత్రణ కోసం మరియు మహిళల ఆరోగ్య కోసం పరీక్షలు నిర్వహించాలన్నారు. ల్యాబ్ రికార్డులు, శాంపుల్ రిపోర్టులు, నాకు రిజిస్టర్, రిజిస్టర్, హెచ్ఎంఐఎస్ రిపోర్ట్ లను పరిశీలించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశు



భ్రంగా ఉంచుకోవాలని, రికార్డులను రిపోర్టులను ఎప్పటికప్పుడు సవరించుకుంటూ నాణ్యమైన సేవలను అందించాలని వైద్యాధికారికి, వైద్య సిబ్బందికి తెలియజేశారు. తనిఖీ సమయంలో ఆస్పత్రి వైద్యాధికారిని మైత్రి, ఫార్మసిస్టు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది ఉన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై అవగాహన

మోస్రా, బతుకమ్మ: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం నేపథ్యంలో, మోస్రా మండలంలో పథకం అమలుకు చేపట్టాల్సిన ముందస్తు ఏర్పాట్లపై సన్నాహక సమావేశం నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి పురుషోత్తం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాస్ గౌడ్, ఎంఈవో నాగనాథ్, గ్రామ సర్పంచులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, క్లస్టర్ ప్రత్యేక అధికారులు, ఆశా కార్యకర్తలు, ఐకేపీ వీవోఏలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఇతర గ్రామస్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి పురుషోత్తం మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన పథకం అమలు మార్గదర్శకాలను అధికారులు, సిబ్బందికి వివరించారు. అర్హులైన కుటుంబాలను



గుర్తించడం, కుటుంబంలో బీమా పొందే అర్హత కలిగిన సంపాదించే సభ్యుల వివరాలను సేకరించడం, గ్రామపంచాయతీల వారీగా నమోదు శిబిరాల నిర్వహణ, దరఖాస్తుల పరిశీలన, ఆధార్, రేషన్ కార్డు, మొబైల్ నంబర్లు మరియు నామినీ వివరాల నమోదు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే ప్రతి గ్రామపంచాయతీలో నమోదు శిబిరాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు, సిబ్బందికి బాధ్యతల కేటాయింపు, ప్రచార కార్యక్రమాలు, బ్యానర్లు, పోస్టర్లు, కరపత్రాల ఏర్పాటు, డేటా ఎంట్రీ మరియు రికార్డుల నిర్వహణపై చర్చించారు. వృద్ధులు, దివ్యాంగులు , ఇతర బలహీన వర్గాలకు ప్రత్యేక సహాయం అందించాలని సూచించారు. మండల, గ్రామస్థాయి అధికారులు, సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని, అర్హులైన ఏ ఒక్క కుటుంబం కూడా నమోదు ప్రక్రియలో మిగిలిపోకుండా చూడాలని ఆదేశించారు. నమోదు శిబిరాలను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రక్రియను పారదర్శకంగా, సజావుగా నిర్వహించాలని సూచించారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి
అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ

నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : రాజకీయాలకు అతీతంగా నగర అభివృద్ధి కోసం పాటుపడతానని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని 34, 39వ డివిజన్లలో బుధవారం రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు తీసుకురావడమే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. ఎంపీ ధర్మపురి అరవింద్ సహకారంతో నిజామాబాద్ పార్లమెంటు పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో కేంద్ర నిధులతో అభివృద్ధి కొనసాగుతుందన్నారు. కార్పొరేషన్ లో ఇటీవల కేటాయించిన 20 లక్షల నిధులతో పాలు డివిజన్లలో అభివృద్ధి పనులకు భూమిపూజ చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్



ఫండ్ కేటాయించాలని, దీంతో మరిన్ని పనులు ముందుకు సాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్లు బంటు ప్రీతి ప్రవీణ్, జ్యోతి మురళి, నాయకులు సాయిరాం, పవన్ ముందడ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.మిర్చి కంపౌండ్ లో పాఠశాల ఆకస్మిక తనిఖీనగరంలోని మిర్చి కంపౌండ్ లో



ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల మధ్యాహ్న భోజన చేస్తుండగా పరిశీలించారు. అయితే మెనూ ప్రకారం భోజనం పెట్టకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానంగా నాణ్యత ఉండాలని నిర్వాహకులకు సూచించారు. అలాగే పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఉపాధ్యాయులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

భీమ్ గల్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి
పీసీసీ చీఫ్ ను కలిసి మండల కాంగ్రెస్ నాయకులు



భీమ్ గల్, బతుకమ్మ భీమ్ గల్ మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ బుధవారం మండల కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ మల్లెల లక్ష్మణ్, మండల సర్పంచ్ ల ఫారం ప్రెసిడెంట్ అరిగేలా జనార్దన్ లు పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కు వినతి పత్రం అందజేశారు. మండల కేంద్రంలోని పలు కుల సంఘ భవనాల నిర్మాణంకు, పట్టణంలోని డ్రైనేజీ నిర్మాణం పనులకు, అంతర్గత సీ సీ, బీటీ రోడ్ల నిర్మాణంకు కావాలసిన నిధులను మంజూరు ఇప్పించాలను కోరారు. దానికి పీసీసీ చీఫ్ సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు.

అధ్యాత్మిక సాంప్రదాయ,ఆచార, వ్యవహారాలు భవితరాలకు అందాలి
బీజేపీ కానిస్టెన్సీ ఇంచార్జ్ డాక్టర్ ఏలేటి మల్లికార్జున్ రెడ్డి



భీమ్ గల్, బతుకమ్మ :ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా మన సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు భావితరాలకు అందుతాయని బాల్కొండ కానిస్టెన్సీ బీజేపీ ఇంచార్జ్ డా. మల్లికార్జున్ రెడ్డి అన్నారు. మండలం మెండోరా గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి 15వ వార్షికోత్సవ వేడుకల్లో బుధవారం పాల్గొని, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, గౌడ సంఘం సభ్యులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రేణుక ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. గ్రామాల్లో ఇలాంటి పండగలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తేనే ముందు తరానికి వ్యవహారాలు తెలుస్తయాన్నారు ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షులు పార్వతి శ్రీనివాస్,బీజేపీ భీమ్ గల్ మండల అధ్యక్షులు అరే రవీందర్, మాజీ ఎంపీపీ కొండా గోదావరి ప్రకాష్ గౌడ్, బొడిగే లింబాద్రి,నిమ్మల రాజేశ్వర్ గౌడ్,సీ. హెచ్ శ్రీనివాస్,రాంచందర్ గౌడ్,మల్లేష్ గౌడ్,బాల కృష్ణ,ప్రేమగౌడ్,కోటేశ్వర్,తిరుపతి గౌడ్,పొన్నం శ్రీనివాస్,లక్ష్మణ్ గౌడ్,వాల్గోట్ బావన్న,బీజేపీ నాయకులు నాగార్జున్,గాడి వేణు,బాబూరావు,తక్కూరి రామ్,ఆదిత్యా గ్రామస్థులు పాల్గొన్నారు..

ఏకలవ్య మోడల్ స్కూల్ నిర్వహణను మరింతగా మెరుగుపర్చాలి

విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం, మెరుగైన వసతులు కల్పించాలి

అధికారులకు కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాలు



నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : ఇందల్వాయి మండల కేంద్రంలో కొనసాగుతున్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్వహణను మరింతగా మెరుగుప ర్చాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాల యాల సముదాయంలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్వహణ, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, పాఠశాలలోని మౌలిక వసతులు, విద్యా ప్రమాణాలు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. పాఠశాలలో నెలకొని ఉన్న సమస్యలు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, వసతి గృహాల నిర్వహణ, తాగునీరు, విద్యుత్, పారిశు ద్ధ్యం, మరుగుదొడ్లు, భోజన సదుపాయాలు తదితర అంశాలపై కలెక్టర్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు ఉన్నా వాటిని కప్పిపుచ్చ కుండా వాస్తవ పరిస్థితుల ను తన దృష్టికి తీసుకురా వాలని నిర్వాహకులకు సూచించారు. సమస్యలను ముందుగానే గుర్తించి, వాటికి తక్షణ పరిష్కారం చూపే విధంగా అధికారు లు సమన్వయంతో పనిచేయాలని అన్నారు.విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయా లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పాఠశాలలో చేపట్టాల్సిన మౌలిక వసతుల అభివృద్ధి, మరమ్మతు పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, శారీరక అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ అన్నారు. విద్యార్థినీ, విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన, పౌష్టికాహారం అందేలా పాఠశాల నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. భోజన పదార్థాల నాణ్యతను ప్రతిరోజూ పరిశీలించాలని ఆదేశించారు.విద్యార్థులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, అనారోగ్య సమస్యలు ఉన్న విద్యార్థులను వెంటనే గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందేలా చూడాలని అన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని స్పష్టం చేశారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు.విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యాభ్యాసం కొనసాగిం చేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అన్నారు. పాఠశాల నిర్వహణకు సంబంధించి న ప్రతి అంశాన్ని అధికారులు బాధ్యతతో పర్యవేక్షిస్తూ, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ భుజంగరావు, ఇంచార్జి డీఈఓ సాయాగౌడ్, ప్రాంతీయ సమన్వయకర్త గంగారాం నాయక్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ముంబై వాసికి లండన్‌లో 30 ఏళ్ళ జైలు శిక్ష



వెబ్ డెస్క్, బతుకమ్మ :ముంబైకి చెందిన భారతీయుడు బిలాల్ ఖాజీ ఉన్నత విద్య కోసం బ్రిటన్‌కు వెళ్లాడు. అక్కడ అతను నకిలీ ఆన్‌లైన్ ప్రొఫైల్స్ సృష్టించి, తనను తాను రీజ్ అనే 14 ఏళ్ల తెల్లజాతి బ్రిటిష్ బాలుడిగా పరిచయం చేసుకున్నాడు. తన గుర్తింపు నిజమైనదిగా కనిపించేందుకు మరో బాలుడి ఫొటోను కూడా ఉపయోగించాడు. స్నాప్‌చాట్, విజ్, వింక్, రోబ్లాక్స్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లను ఉపయోగించి టీనేజ్ బాలికలను లక్ష్యంగా చేసుకున్నాడు. మొదట వారితో పరిచయం పెంచుకుని, క్రమంగా వారి నమ్మకాన్ని సంపాదించేవాడు. ఆ బాలికలు అతడిని నమ్మిన తర్వాత, వారి వ్యక్తిగత ఫొటోలు, వీడియోలను పంపేలా ప్రలోభపెట్టేవాడు. ఆ తర్వాత వాటిని అడ్డుపెట్టుకుని బెదిరింపులకు పాల్పడుతూ, మరిన్ని ఫొటోలు, వీడియోలు పంపాలని బ్లాక్‌మెయిల్ చేసేవాడు.ఈ కేసులో వెలుగులోకి వచ్చిన బాధితుల సంఖ్య విస్తుపోయేలా ఉంది. పోలీసుల విచారణలో 11 నుంచి 17 సంవత్సరాల మధ్య వయస్సు గల 70 మంది బాలికలు బాధితులుగా గుర్తించబడ్డారు. తాజాగా బ్రిటన్ న్యాయస్థానం బిలాల్ ఖాజీకి 30 సంవత్సరాల జైలు శిక్షతో పాటు, విడుదల అనంతరం మరో 8 సంవత్సరాల పాటు కఠిన పర్యవేక్షణ విధించింది. ఈ ఘటన మనందరికీ ఒక ముఖ్యమైన హెచ్చరిక. ఆన్‌లైన్‌లో మనకు పరిచయమయ్యే వ్యక్తులు తాము చెప్పుకుంటున్న వ్యక్తులే అయి ఉండకపోవచ్చు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇంటర్నెట్ భద్రత, సోషల్ మీడియా ప్రమాదాల గురించి అవగాహన కల్పించాలి. ఆన్‌లైన్‌లో పరిచయమైన వ్యక్తులను గుడ్డిగా నమ్మే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించాలని, బ్రిటన్‌లో మరణశిక్షను రద్దు చేసినప్పటికీ, ఇలాంటి తీవ్రమైన నేరాలకు పాల్పడే వ్యక్తులకు అక్కడి చట్టాల పరిధిలో సాధ్యమైనంత కఠినమైన శిక్ష విధించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

విదేశీ రాజకీయ ప్రతినిధిపై చర్యలు తీసుకోవాలి

భారత్ సమ్మిట్ పేరుతో చట్టపరమైన ఉల్లంఘన

పోలీస్ కమిషనర్ కు ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే ధన్ పాల్

నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : ఇటీవల హైదరాబాద్ లో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన భారత్ సమ్మిట్ లో విదేశీ రాజకీయ నాయకుడు జియోకోమో ఫిలిటిక్ చట్టాన్ని ఉల్లంఘించి మాట్లాడారని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్యకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విదేశీయుడైన జియోకోమో తన ప్రసంగంతో విసా నిబంధనలు, ఇమ్మిగ్రేషన్ చట్టాల ఉల్లంఘనకు పాల్పడ్డారని తెలిపారు. కావున పూర్తి విచారణ చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆయన సదస్సులో ప్రసంగిస్తూ " ఓటు చోర్.. గద్ది చోడ్" అనే నినాదం చేసి, భారత అంతర్గత వ్యవహారాలను బహిరంగంగా చెప్పడం తగదన్నారు. ఇందుకు రాహుల్ గాంధీ తో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నవ్వడం సిగ్గుచేటని పేర్కొన్నారు.దేశంలో నిర్వహించే అంతర్జాతీయ సదస్సులు, సెమినార్లు, వర్క్ షాప్ లు ఇతర కార్యక్రమాలు నిర్వహించినప్పుడు విదేశీ ప్రతినిధులు దేశ మంత్రిత్వ శాఖ నిబంధనల ప్రకారం నడుచుకోవాలని గుర్తు చేశారు. అలాగే ప్రత్యేక పొలిటికల్ క్లియరెన్స్ ఇస్తుందన్నారు. కానీ వీటన్నిటి ఉల్లంఘిస్తూ ప్రసంగం చేయడం దేశ పౌరులను అవమానించడమేనన్నారు. కావున ఈ ఉల్లంఘనలను పరిగణలోకి తీసుకొని తగు చర్యలు తీసుకోవాలని కోరారు.



13వ వార్డులో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరాలి

13వ వార్డు కౌన్సిలర్ ఖలేఖ్.

బాన్సువాడ బతుకమ్మ: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మరింత మెరుగైన రేషన్ సేవలు అందించాలనే లక్ష్యంతో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తోంది.ఇందులో భాగంగా బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు టీచర్స్ కాలనీలో ఉన్న రేషన్ షాప్ నంబర్ 1 వద్ద లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ ఖలీఖ్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రేషన్ సరుకుల పంపిణీలో పారదర్శకత, సౌలభ్యం పెంపొందించేందుకు స్మార్ట్ రేషన్ కార్డులు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జీపీఓ హర్ష, 13వ వార్డు కౌన్సిలర్ ఖలేఖ్, కోఆప్షన్ సభ్యులు సుల్తానా గౌస్, రేషన్ షాప్ డీలర్ సంధ్య తదితరులు పాల్గొన్నారు.



ఏసీబీ వలలో పబ్లిక్ ప్రాసిక్యూటర్

ప్రైవేట్ వ్యక్తి ద్వారా

లక్షా 50 వేల లంచం తీసుకుంటూ పట్టివేత



పెద్దపల్లి, బతుకమ్మ : న్యాయవ్యవస్థ కూడా అవినీతికి అతీతం కాదని ఏసీబీ నిరూపించింది. రాష్ట్రంలో ఇది వరకు జ్యుడిషియల్ ఉద్యోగులు లంచాలు తీసుకుంటూ దొరికిన ఉదంతాలు ఉండగా తొలిసారి పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఏసీబీకి చిక్కిన కొత్త చరిత్ర ఆవిష్కృతమైంది. పెద్దపల్లి జిల్లా డిస్ట్రిక్ సెషన్స్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ డొంకన రవీంధర్ తన వద్ద ప్రైవేట్ గా పని చేస్తున్న రెడ్డిరాజయ్య అనే వ్యక్తి ద్వారా లక్షా 50 వేల లంచం తీసుకుంటుడగా కరీంనగర్ రేంజ్ ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. పెద్దపల్లి జిల్లాలో ధర్మారం పోలీస్ స్టేషన్ లో 2023లో నమోదైన క్రిమినల్ కేసుకు సంబంధించి పెండింగ్ లో ఉన్న ట్రయల్ విషయంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ నిందితుని నుంచి రూ.2 లక్షల లంచం డిమాండ్ చేశారు. చివరకు లక్షా 50 వేలు ఇవ్వాలని ఒప్పందం కుదిరింది. బాధితుడు ఏసీబీని ఆశ్రయించగా పక్కా ప్లాన్ ప్రకారం పీపీ రవీంధర్ నివాసంలో లంచం తీసుకుంటుండగా ఇద్దరిని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఇరువురిపై కేసు నమోదు చేసి కరీంనగర్ ఏసీబీ కోర్టులో హాజరుపర్చగా న్యాయస్థానం ఇద్దరిని రిమాండ్ విధించింది.

నారాయణ పాఠశాలలో బహుమతుల ప్రదానోత్సవం

ఎన్ పీఎల్ ఈ చాంప్స్ క్రీడా పోటీల నిర్వాహణ



నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : నగరంలోని సుభాష్‌నగర్ లోని నారాయణ పాఠశాల విద్యార్థులకు పాలిటెక్నిక్ గ్రౌండ్ లో నిర్వహించిన వివిధ పోటీలు బుధవారం ఉత్సాహంగా జరిగాయి. మంగళ, బుధవా రాల్లో నారాయణ పబ్లిక్ స్కూల్ ఈ చాంప్స్ పేరిట క్రీడా పోటీలను నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన విజేతలకు పాఠశాల ఆవరణలో విద్యా సంస్థల ఏజీఎం సూర్యవంశీ శివాజి క్రీడా పోటీలలో ప్రతిభ కనబ రిచిన విద్యార్థులకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు, తలి దండ్రుల సమక్షంలో పతకాలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. పాఠ శాల ప్రిన్సిపాల్ జి.చందన విద్యార్థులను అభినందిస్తూ, చదువుతో పా టు క్రీడలు కూడా విద్యార్థుల సమగ్ర వికాసానికి ఎంతో అవసరమని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల విజయాలను ప్రత్యక్షంగా వీక్షిస్తూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సం దర్భంగా విజేతలందరికీ హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక చేయూత

ఇందల్వాయి,బతుకమ్మ : ఇంతల్వాయి మండలంలోని ఇందల్వాయి గ్రామంలో జగ్గా ఎర్ర గంగారం అనారోగ్య కారణాలతో మృతి చెందగా ఆ యొక్క కుల సంఘం పెద్దమనిషి తుప్ప సాయి బాబా ఆధ్వర్యంలో 5000 రూపాయల ఆర్థిక సహాయాన్ని నగదుగా బుధవారం అందించారు, అంత్యక్రియల కోసం ఈ యొక్క డబ్బును వాడుకోవాలని సూచించారు, ఇందల్వాయి గ్రామంలోని ఎస్సీ మాల కులాలకు చెందిన ఎవరైనా మృతి చెందిన అంత్యక్రియల కోసం ఐదు వేల రూపాయల నగదును అందజేయడం ఆనవాయితీగా వస్తుందని ఆయన వివరించారు, కుల సంఘంలో సభ్యుడిగా ఉండి మృతి చెందితే కుల సంఘం తరపున ఆర్థిక సహాయం అందజేస్తామని ఆయన వివరించారు, ఈ కార్యక్రమంలో కుల సంఘం పెద్దమనిషి తుప్ప సాయిబాబా తోపాటు పూజ్యం రవికుమార్, ఎరుకల ప్రసాద్, జగ్గా రాములు, గుజ్జరి నరసయ్య, జగ్గా గంగ సాయిలు, జెగ్గా నవీన్ తదితరులు పాల్గొన్నారు



నాగార్జునసాగర్‌పై ఏపీ చర్యలు.. సీఎం ఏం చేస్తున్నారు?

రేవంత్ రెడ్డిపై తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత



హైదరాబాద్ , బతుకమ్మ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నాగార్జున సాగర్ ను చెరబట్టి గుట్టుచప్పుడు కాకుండా టన్నెల్ ప్రాజెక్టు నిర్మిస్తుంటే రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఏం చేస్తున్నావని రేవంత్ రెడ్డి పై తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఫైర్ అయ్యారు. నాగార్జున సాగర్ నుంచి ఏపీ చేపట్టిన అక్రమ ప్రాజెక్టుపై ఎక్స్ (ట్విట్టర్) వేదికగా బుధవారం కవిత స్పందించారు. నాగార్జున సాగర్ డెడ్ స్టోరేజీ నుంచి అక్రమంగా నీటిని తరలించేందుకు ఏపీ భారీ టన్నెల్ ప్రాజెక్టు చేపట్టినా తెలంగాణ ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందో చెప్పాలని నిలదీశారు. రేవంత్ రెడ్డి అనుమతితోనే ఏపీ ప్రభుత్వం ఈ టన్నెల్ ప్రాజెక్టును చేపట్టిందా అవీ ప్రశ్నించారు. ఏపీ ప్రభుత్వం ఇంత భారీ ఎత్తున ప్రాజెక్టు పనులు చేస్తున్నా తెలంగాణ ప్రభుత్వానికి కనీస సమాచారం లేదు అంటే నిఘా వ్యవస్థ ఏం చేస్తుందని ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వానికి ఏపీ అక్రమ ప్రాజెక్టుపై కనీస సమాచారం లేదంటే ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ఒక్క క్షణం కూడా పదవిలో ఉండడానికి అర్హుడు కాదని స్పష్టం చేశారు. కేంద్రంపై ఒత్తిడి పెంచి ఏపీ చేపట్టిన అక్రమ ప్రాజెక్టు నిర్మాణ పనులను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు.

లక్ష్మయ్య,లస్మవ్వ,జ్ఞాపకార్థంగా మినీ బస్టాండ్‌కు భూమి పూజ



ఏర్గట్ల,బతుకమ్మ: తాళ్ల రాంపూర్ గ్రామానికి చెందిన మొగిలిపేట లక్ష్మయ్య, మొగిలిపేట లస్మవ్వ, వృద్ధులై మరణించడం జరిగింది.వారి జ్ఞాపకార్థంగా వారి కుమారులు కంఠం గణేష్,కంఠం నరేష్,లు తాళ్ల రాంపూర్ గ్రామంలో శ్రీ రామాలయ దేవాలయం వద్ద వారి తండ్రి కంఠం లక్ష్మయ్య,తల్లి కంఠం లస్మవ్వ, జ్ఞాపకార్థంగా మినీ బస్టాండ్ నిర్మాణం కొరకు బుధవారం రోజున గ్రామ ఇన్చార్జి సర్పంచ్ చాట్ల జనార్దన్ చే పూజా కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఇట్టి కార్యక్రమంలో తాల్లారాంపూర్ ఇన్చార్జ్ సర్పంచ్ చాట్ల జనార్దన్, ఏర్గట్ల మండల మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సోమ దేవారెడ్డి,రామాలయ కమిటీ సభ్యులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఇట్టి సందర్భంలో గ్రామ ఇన్చార్జి సర్పంచ్ చాట్ల జనార్దన్ మాట్లాడుతూ స్వర్గస్తులైన తల్లిదండ్రులు లక్ష్మయ్య లస్మవ్వ,పేరుపై వారి కుమారులైన గణేష్,నరేష్ లు దాతలుగా తాళ్ల రాంపూర్ లో రామాలయం ముందర మినీ బస్టాండ్ నిర్మించడం పట్ల గ్రామ ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఒకే కాన్పులో రెండు దూడలు జననం..

- పశువుకు కాన్పు నిర్వహించిన గోపాలమిత్ర రాము..



రుద్రూర్ (కోటగిరి), బతుకమ్మ న్యూస్ : ఓకే కాన్పులో పశువుకు రెండు లేగదూడలు జన్మించిన సిద్దాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజకవర్గం రుద్రూర్ మండలం సిద్దాపూర్ గ్రామంలో రైతు బిట్ల గంగారాం పోషిస్తున్న ఆవు బుధవారం రెండు లేగ దూడలకు జన్మనిచ్చింది. ప్రసవం సమయంలో పశువు ఇబ్బంది పడటం గమనించిన రైతు వెంటనే అందుబాటులో ఉన్న గోపాలమిత్ర రాముకు సమాచారం అందించగా అక్కడికి వచ్చిన గోపాలమిత్ర రాము పశువుకు జాగ్రత్తగా కాన్పు నిర్వహించారు. ముందుగా ఒక లేగదూడ జన్మించిన అనంతరం మరో లేగదూడ ఉన్నట్లు గుర్తించిన గోపాలమిత్ర రాము రెండవ దూడకు సైతం క్షేమంగా కాన్పు నిర్వహించారు. ఓకే కాన్పులో రెండు దూడలు జన్మించడంతో రైతు బిట్ల గంగారాం హర్షం వ్యక్తం చేశారు. క్షేమంగా కాన్పు నిర్వహించిన గోపాలమిత్ర రాముకు ధన్యవాదాలు తెలిపారు. ఓకే కాన్పులో రెండు లేగదూడలు జన్మించడంతో స్థానికంగా ప్రత్యేకతను సంతరించుకుంది.

మనోరమ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు...

రుద్రూర్, బతుకమ్మ : రుద్రూర్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం నిజామాబాద్ మనోరమ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా గ్రామ సర్పంచ్ ఇందూర్ సునీత చంద్రశేఖర్, ఉప సర్పంచ్ షేక్ నిస్సార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇందూర్ చంద్ర శేఖర్ పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి, నిపుణులైన సూపర్ స్పెషాలిటీ వైద్యులతో ఈ క్యాంప్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ





శిబిరంలో గుండె, కిడ్నీ, నరాలు, ఎముకలు, స్త్రీల వ్యాధులు, పిల్లల వైద్యం, ఈఎన్‌టీ, గ్యాస్ట్రో ఎంటరాలజీ తదితర విభాగాలకు చెందిన ప్రముఖ వైద్యులు రోగులను వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మనోరమ హాస్పిటల్ సిబ్బంది రుద్రూర్ గ్రామ నివాసి కార్తిక్, గ్రామ పెద్దలు బచ్చు రామ్ సెట్, హాస్పటల్ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్లతో పేదలకు ఆర్థిక భరోసా

యువత మద్యానికి దూరంగా ఉండాలి..

ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి.

బాన్సువాడ, బతుకమ్మ: అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలోని నస్రుల్లాబాద్, వర్ని, చందూర్, మోస్రా మండల కేంద్రాల్లో నూతనంగా మంజూరైన చేయూత పింఛన్ల మంజూరు పత్రాలను బుధవారం లబ్ధిదారులకు ఆయన అందజేశారు.ఈ సందర్భంగా పోచారం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ప్రభుత్వం అందించే నెలవారీ పింఛన్లు కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాకుండా, వారి ఆత్మగౌరవంతో కూడిన జీవితానికి భరోసా కల్పిస్తాయని పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందేలా చర్యలు తీసుకుంటున్నామని, ఆర్థిక ఇబ్బందులతో





ఏ పేద కుటుంబం ఇబ్బందులు పడకూడదన్నదే ప్రభుత్వ సంకల్పమని తెలిపారు.
. . . యువత మద్యానికి దూరంగా ఉండాలి. గ్రామాల్లో బెల్ట్ షాపుల కారణంగా యువత చిన్న వయస్సులోనే మద్యానికి బానిసలవడం ఆందోళన కలిగిస్తోందని పోచారం అన్నారు. మద్యపానం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి యువకులు ప్రాణాలు కోల్పోతున్నారని, దీంతో వారి కుటుంబాలు ఆధారం కోల్పోయి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.యువత మద్యానికి దూరంగా ఉండాలని, గ్రామాల్లో బెల్ట్ షాపుల నియంత్రణపై పెద్దలు, గ్రామస్థులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని పిలుపునిచ్చారు. యువత భవిష్యత్తును, కుటుంబాల సంక్షేమాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు, బాన్సువాడ ఆర్డీఓ రవీందర్ రెడ్డి ,ఆయా మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, పింఛన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం

20 వేలకు పైగా ఓటర్లకు మరోసారి నోటీసులు.

డిసెంబర్ 22న తుది ఓటరు జాబితా ప్రచురణ.

బాన్సువాడ బతుకమ్మ: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా బుధవారం బాన్సువాడ ఆర్డీవో కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆర్డీవో, ఈఆర్ఓ రవీందర్ రెడ్డి, తహసీల్దార్ రాజా నందర్ గౌడ్, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ కాపర్తి సంగమేశ్వర్ హాజరై ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని సమీక్షించారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలో ఎస్ఐఆర్ నోటీసులకు స్పందించని 20 వేలకు పైగా



ఓటర్లకు మరోసారి నోటీసులు జారీ చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. నోటీసులకు స్పందించి అవసరమైన వివరాలు సమర్పించేందుకు డిసెంబర్ 15 వరకు గడువు కల్పించినట్లు తెలిపారు. డిసెంబర్ 22, 2026న తుది ఓటరు ముసాయిదా జాబితా ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు.జాబితా ప్రచురణ అనంతరం సంబంధిత బూత్‌లకు చెందిన ఓటరు జాబితాలు బీఎల్ఓల వద్ద అందుబాటులో ఉంటాయని, రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లు అవసరమైన మేరకు జిరాక్స్ కాపీలు తీసుకోవచ్చని వివరించారు.అనంతరం ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తుల పెండింగ్ వివరాలను వెల్లడించారు. 2026 జనవరి 1 నుంచి నవంబర్ 18 వరకు నమోదైన దరఖాస్తుల్లో ఫారం-6కు సంబంధించి 972, ఫారం-7కు సంబంధించి 182, ఫారం-8కు సంబంధించి 998 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. మొత్తం 2,152 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, వీటిలో బాన్సువాడ పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లోనే 812 దరఖాస్తులు ఉన్నట్లు వెల్లడించారు.ఈ సమావేశంలో రాజకీయ పార్టీల నాయకులు రమేష్ యాదవ్, కొనాల గంగారెడ్డి, అబ్దుల్ లయక్,షంషుద్దీన్ పాల్గొన్నారు.

పుల్కల్ లో సంక్షేమ పండుగ..
కళ్యాణ లక్ష్మి చెక్కులు, నూతన పెన్షన్ల పంపిణీ





బతుకమ్మ: బిచ్కుంద. కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలం పుల్కల్ గ్రామంలో సంక్షేమ పథకాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా గ్రామస్తులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు మరియు నూతన పెన్షన్ల అర్హత పత్రాలను గ్రామ సర్పంచ్ సంతోష్ పటేల్ చేతుల మీదుగా అందించారు.చెక్కులు, పెన్షన్ పత్రాలు అందుకున్న లబ్ధిదారుల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. పేద కుటుంబాలకు ఈ పథకాలు ఎంతో అండగా నిలుస్తాయని వారు సంతోషం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ సంతోష్ పటేల్ మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వంలో ప్రతి పేద ఇంటికి సంక్షేమ పథకాలు అందడమే కాకుండా, ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉన్నప్పుడే ప్రజా ప్రభుత్వ సంకల్పం నెరవేరుతుందని అన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా గ్రామంలో చర్యలు తీసుకుంటామని, ఎవరూ పథకాలకు దూరం కాకూడదనే ఉద్దేశ్యంతో పనిచేస్తున్నామని ఆయన తెలిపారు. పెన్షన్లు, కళ్యాణ లక్ష్మి వంటి పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతాయని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ ,గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, లబ్ధిదారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ..

కమ్మర్‌పల్లి, బతుకమ్మ:మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన ఎర్ర పద్మకు ప్రభుత్వం మంజూరు చేసిన కల్యాణలక్ష్మి పథకం చెక్కును సర్పంచ్ సంధ్యరాజశేఖర్,డీసీసీ కార్యదర్శి సంజీవ్ యాదవ్ కలిసి బుధవారం రోజున పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కల్యాణలక్ష్మి పథకం నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తోందని, ఆడపిల్లల వివాహ సమయంలో తల్లిదండ్రులకు ఆర్థికంగా ఎంతో ఊరటనిస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబం ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ పథకం ద్వారా ఆర్థిక సహాయం అందించిన ప్రభుత్వానికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కమ్మర్ పల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బోనగిరి భాస్కర్,వెంకటి గణేష్, మురళి,జైడి శ్రీనివాస్,ధర్పల్లి రాకేష్, మండల శేఖర్, రజాక్ తదితరులు పాల్గొన్నారు.



ట్రాక్టర్‌లో తరలిస్తున్న కలపను పట్టివేత



ఏర్గట్ల, బతుకమ్మ :ఏర్గట్ల మండల కేంద్రం శివారులోని బుధవారం తెల్లవారుజామున పెట్రోలింగ్ నిర్వహిస్తున్న కమ్మర్ పల్లి రేంజ్ ఫారెస్ట్ అధికారులు ట్రాక్టర్లతో తరలుతున్న కలపను స్వాధీనం చేసుకున్నారు. కమ్మర్ పల్లి ఇంచార్జి ఎఫ్ఆర్వో అరుణ్ కుమార్ కు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఏర్గట్ల గట్ల గ్రామ చౌరస్తా వద్ద కాపుకాసి కలపను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్ తో సహా కలపను కమ్మర్ పల్లి ఫారెస్ట్ ఆఫీసు కార్యాలయానికి తరలించి సీజ్ చేశారు.

ఇసుక మాఫియా గురించి మాట్లాడే నైతిక హక్కు బిఆర్ఎస్ పార్టీ నాయకులకు లేదు

ఏర్గట్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శివన్నోళ్ల శివకుమార్

ఏర్గట్ల,బతుకమ్మ:ఏర్గట్ల మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ముత్యాల సునీల్ కుమార్ పై విలేకరుల సమావేశంలో ఏర్గట్ల బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు,పూర్ణానందం పార్టీ నాయకులు చేసిన అసత్యపూ ఆరోపణలు చేసిన,ఇకముందు చేస్తే సహించేది లేదని ఏర్గట్ల మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పార్టీ అధ్యక్షుడు శివన్నోళ్ల శివకుమార్ బుధవారం రోజున మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఏర్గట్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శివన్నోళ్ల శివకుమార్, మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సోమా దేవరెడ్డి, మాట్లాడుతూ ఇసుక మాఫియా గురించి మాట్లాడే నైతిక హక్కు బిఆర్ఎస్ పార్టీ నాయకులకు ఉందా అని ప్రశ్నించారు.గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇసుక దందాలపై బహిరంగ చర్చకు సిద్ధమా..?? అని సవాల్ విసిరారు.ఇసుక వ్యవహారంపై మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు ముందుగా తమ గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఇసుక వ్యాపారంపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.గతంలో అధికారంలో ఉన్నప్పుడు మంత్రిగా పనిచేసిన ప్రస్తుత ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి కమిషన్ల మంత్రిగా పేరు తెచ్చుకున్నారు.ప్రతి పనిలో కమిషన్ల ఆరోపణలు ఎదుర్కొన్న నాయకులు ఇప్పుడు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉంది.గ్రామాల్లో ఒకరిద్దరితో ఇసుక టెండర్ల వేయించి ఇసుక మీద ధనర్జన చేసిన చరిత్ర బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ది మరియు ఆయన తమ్ముడు అజయ్ రెడ్డిదని ఆరోపించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులు మినహా సామాన్యులు ఇసుక గురించి మాట్లాడితే పరిస్థితి ఉండేదా..?ఇసుక వ్యాపారంపై గుత్తాధిపత్యం ఎవరి చేతుల్లో ఉండేది? ఈ విషయాలన్నీ ప్రజలకు తెలుసు.గత ప్రభుత్వం హయాంలో పదేళ్లుగా ఇసుక మీద కోట్ల రూపాయలు సంపాదించినోళ్లు ఈరోజు ఇసుక గురించి మాట్లాడితే విడ్డూరంగా ఉందన్నారు.బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ హయాంలో నిన్న విలేకరుల ప్రెస్ మీట్ పెట్టిన బీఆర్ఎస్ నాయకులకు ఇసుక దందాలో ఎంతెంత డబ్బు అందేదో అందరికీ తెలిసిన బహిరంగ రహస్యమని అన్నారు. బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలవకముందు లక్ష రూపాయలు కూడా విలువ చేయని మారుతి జిన్ కారులో పయనించే ఆయనకు కేవలం ఐదు సంవత్సరాల వ్యవధిలో 100 కోట్ల ఎన్నికల ఖర్చు డబ్బులు ఎక్కడివని ప్రశ్నించారు. హైదరాబాద్ హైటెక్ సిటీ సమీపంలోని పట్టి నాగులపల్లి,జన్వాడ ప్రాంతంలో వందల కోట్ల విలువచేసే18 ఎకరాల భూమి ఎక్కడి నుండి వచ్చిందని.ఇదంతా బట్టాపూర్ క్వారిని కొల్లగొట్టి ,ప్రజల దోపిడి సొమ్ము కాదా అని ప్రశ్నించారు. హైదరాబాద్ లో 3 పెద్ద ఇండ్లు ఉన్నట్లు ప్రశాంత్ రెడ్డి గారే ఇంటర్వ్యూలో చెప్పారని ఈ డబ్బంతా ఆయనకు ఎక్కడిదని విమర్శించారు.ఏ వ్యాపారం లేని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఇన్ని వందల కోట్లు ప్రజల మీద పడి దోచుకున్నారని తెలిపారు.బాల్కొండ నియోజకవర్గానికి ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి అన్న విషయాన్ని బిఆర్ఎస్ పార్టీ నాయకులు మర్చిపోయినట్లు ఉన్నారని ఎమ్మెల్యే నియోజకవర్గ అభివృద్ధి బాధ్యత ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి మీద లేదా అని ప్రశ్నించారు. కానీ నేడు పరిస్థితి పూర్తిగా మారిందని విమర్శించారు. బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ముత్యాల సునీల్ కుమార్ నాయకత్వంలో ప్రజా ప్రభుత్వంలో ఇసుక పాయింట్ల వద్ద బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తల ట్రాక్టర్లు సైతం నడుస్తున్నాయి.ఎలాంటి రాజకీయ వివక్ష లేకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి ఒక్కరికీ ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు.ప్రస్తుతం నడుస్తున్న ప్రభుత్వ ఇసుక పాయింట్ల వద్ద బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల ట్రాక్టర్లు నడుస్తున్న విషయం ఏర్గట్ల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పూర్ణానందం పార్టీ నాయకులకు తెలియదా??వాస్తవ పరిస్థితులను తెలుసుకోకుండా ప్రెస్‌మీట్లు పెట్టి ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.ఇసుక పాయింట్ల వద్ద ట్రాక్టర్లు నడుపుతున్న మీ పార్టీ కార్యకర్తలను అడిగితే వాస్తవాలు తెలుస్తాయన్నారు.ప్రెస్ మీట్ పెట్టేముందు గతంలో మీ హయంలో మీరు అమ్మిన ట్రిప్పు ఇసుక ధర ఎంత ప్రస్తుతం ఎంత అని ప్రస్తుతం మీ కార్యకర్తలు నడుపుతున్న ఇసుక దందాను గురించి తెలుసుకోవాలనివారితో మాట్లాడండి,మీ బిఆర్ఎస్ పదేళ్ల ప్రభుత్వములో మీ ట్రాక్టర్లు,టిప్పర్లు తప్ప వేరేవారివి ఒక్కరిది అయినా అనుమతి ఇచ్చారా అనేది చెప్పి ఆ తర్వాతే బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ పై విమర్శలు చేయలన్నారు. రాజకీయ విమర్శలకు మేము భయపడేది లేదు. కానీ వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసేలా నిరాధార ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదు.ప్రతి ఆరోపణకు ఆధారాలతో సమాధానం చెబుతాం.



గతంలో ఎవరు ఏం చేశారు? నేడు ఎవరుఎలా పనిచేస్తున్నారు? అనే విషయాలను ప్రజల ముందు ఉంచుతామని హెచ్చరించారు.గతంలో మీ పాలనలో ఇసుక వ్యాపారం ఎలా సాగిందో ప్రజలకు తెలుసు. నేడు ప్రజా ప్రభుత్వంలో ఇసుక పాయింట్లు ఎలా నడుస్తున్నాయో కూడా ప్రజలు చూస్తున్నారు. చరిత్రను మరిచి మాట్లాడితే ప్రజలే తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏర్గట్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శివన్నోళ్ల శివకుమార్,సోమాదేవ రెడ్డి, కమ్మర్పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కోరిపల్లి లింగారెడ్డి, ఏర్గట్ల మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు తొర్తి గ్రామ సర్పంచ్ కొండ భూమేష్,తడపాకల్ జింక అనిల్ కుమార్,సున్నపు శ్రీనివాస్,గుమ్మిర్యాల దేశ బోయిన సంజీవ్, నాగేంద్ర నగర్ సర్పంచ్ సందే రంజిత్,తాళ్ల రాంపూర్ సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి,ధోశీచంద ఉప సర్పంచ్ ఆసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఏర్గట్ల మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దానం గంగ మోహన్,గడ్డం జీవన్ రెడ్డి,బద్దం లింగారెడ్డి, పన్నాల నర్సారెడ్డి,ముస్కు మోహన్ రెడ్డి,కూరాకుల బోర్రన్న,రొక్కెడ్ది చిన్న సాయిలు,సున్నపు లింగన్న, సజ్జనపు రవి,ఏర్గట్ల మండల గౌడ సంఘం అధ్యక్షుడు సుదర్శనేని శ్రీనివాస్ గౌడ్,ఈరవట్నం చిన్న భూమన్న,మండల పరిధిలోని కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు ఉప సర్పంచులు,మాజీ కేఎంసీ డైరెక్టర్,ఆలయ కమిటీ చైర్మన్,ఇందిరమ్మ కమిటీ సభ్యులు,యూత్ కాంగ్రెస్ నాయకులు,సీనియర్ కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అగ్గి మల్లన్న గుడి నిర్మాణంకు భూమి పూజ



వేల్పూర్, బతుకమ్మ :మండలం అమీనాపూర్ గ్రామంలో అగ్గి మల్లన్న కమిటీ ఆధ్వర్యంలో బుధవారం గుడి నిర్మాణం పనులకు కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక భూమి పూజ చేశారు. ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ గుండే సౌందర్య నవీన్ ఉప సర్పంచ్ స్వామి గౌడ్ సెక్రెటరీ గణేష్ పాల్గొని పూజ చేశారు. ఈ కార్యక్రమానికి ఆది మల్లన్న కమిటీ సభ్యులు గ్రామపంచాయతీ సభ్యులు గ్రామ ప్రజలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

పసుపు పంట సాగు పై అవగాహన సదస్సు



వేల్పూర్, బతుకమ్మ :నిజామాబాద్ టర్మరిక్ బోర్డు ఆధ్వర్యంలో, రైతు ప్రగతి ఫార్మర్స్ కోఆపరేటివ్ సొసైటీ, వేల్పూర్ వారి సహకారంతో బుధవారం వేల్పూర్‌లోని గురడి రెడ్డి కాపు సంఘంలో పసుపు పంట సాగు, దిగుబడి, నాణ్యతపై రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నేషనల్ టర్మరిక్ బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పసుపు పంటలో మెరుగైన సాగు విధానాలు, నూతన సాంకేతిక పద్ధతులు, పంట నాణ్యత పెంపుదల, అధిక దిగుబడులు సాధించే మార్గాలు, మార్కెటింగ్ అవకాశాలు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతు ప్రగతి ఫార్మర్స్ కోఆపరేటివ్ సొసైటీ ద్వారా రైతులకు వ్యవసాయ శిక్షణ కార్యక్రమాలు, పంటల సాగుపై సలహాలు, సూచనలు అందిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా పర్యావరణ పరిరక్షణతో పాటు రైతులకు అదనపు ఆదాయ అవకాశాలను కల్పించే లక్ష్యంతో కార్బన్ క్రెడిట్ ప్రాజెక్టులో భాగస్వాములుగా పనిచేస్తున్నట్లు వివరించారు.రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించి, నాణ్యమైన పంట దిగుబడులు సాధించాలని, ఇటువంటి అవగాహన కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్పైసెస్ బోర్డు సీనియర్ ఫీల్డ్ ఆఫీసర్ రాజ మాణిక్యం, టర్మరిక్ రీసెర్చ్ స్టేషన్ హెడ్ సైంటిస్ట్ విద్యా , టెక్నికల్ అసిస్టెంట్ ప్రియాంక ,అగ్రికల్చర్ ఆఫీసర్ రాజు, అగ్రికల్చర్ ఆఫీసర్ రాజు, రైతు ప్రగతి ఫార్మర్స్ కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ దీపక్ , సీ ఈ ఓ సాయితేజ మాధవ, సొసైటీ సిబ్బంది , సభ్యులు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

బిచ్కుందలో నూతన పెన్షన్లు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



బతుకమ్మ:బిచ్కుంద. బిచ్కుంద మున్సిపాలిటీ మరియు మండల కేంద్రంలో నూతన పెన్షన్లు మరియు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా లబ్ధిదారులకు నూతన పెన్షన్ పత్రాలు మరియు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు.ఈ కార్యక్రమంలో తోట లక్ష్మీకాంతరావు మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి పేద ఇంటికి అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామని ఆయన తెలిపారు.మున్సిపల్ చైర్ పర్సన్ సీమా శెట్కార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలు ప్రతి పేద ఇంటికి అందిన నాడే ప్రజా ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని అన్నారు. సామాన్యుల కన్నీళ్లు తుడిచడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఆమె తెలియజేశారు.పెన్షన్లు, చెక్కులు అందుకున్న లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, మండల నాయకులు, అధికారులు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తడి హిప్పర్గలో చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ

మద్నూర్, బతుకమ్మ :తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన నిరుపేదలకు సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. ఈ క్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ ముఖ్య సలహాదారు. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మికాంతారు.రెడ్డి, రాష్ట్ర మాజీ అగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు సూచనలు, ఆదేశాల మేరకు కోటగిరి మండలంలోని కొత్తపల్లి గ్రామానికి నూతనంగా మంజూరైన చేయూత పింఛన్ల మంజూరు పత్రాలను అర్హులైన లబ్ధిదారులకు అందజేశారు. సందర్భంగా నూతనంగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లు వృద్ధులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన పేద కుటుంబాలకు ఆర్థిక భరోసాగా వీలుస్తున్నాయని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలుఅందేలా ప్రజాప్రతినిధులు, సంబంధిత సమన్వయంతో అధికారులు. వనివేయాలన పనిచేయాలని సూచించారు. నూతనంగా పింఛన్లు మంజూరు కావడంతో లబ్ధిదారులుసంతోషం వ్యక్తం చేశారు. పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమపథకాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, అర్హులైన వారికి మరిన్ని సంక్షేమ ఫలాలు అందాలని గ్రామస్థులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలోగ్రామ సర్పంచ్. అశ్విని సుదర్శన్ కంకర్తె. ఉప సర్పంచ్ అంజలి ప్రలాద్ సూర్యవంశీ. పంచాయతీ కార్యదర్శి జ్యోతి జాదవ్. + జూ శీ సాయిలు సార్. గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



మహిళ భవన నిర్మాణం పనులకు మార్కింగ్



వేల్పూర్, బతుకమ్మ :మండలంలోని పచ్చల నడుకు డా గ్రామంలో కమ్యూనిటీ,వ్యక్తిగత సోక్ పీట్ నిర్మాణం, మహిళా భవనం నిర్మాణం పనులకు బుధవారం మార్కెట్ ఇచ్చారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం సంబంధించి పంచాయతీ కార్యదర్శులకు సూచనలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొల్లే నరసయ్య, అన్వేష్ రెడ్డి, ఉప సర్పంచ్ రఘుపతి, ఎంపీడీవో కొట్టాల రఘురాం, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అనుమతులు లేని కట్టెల రవాణా..

ఆరు ట్రాక్టర్లు స్వాధీనం..



కమ్మర్‌పల్లి, బతుకమ్మ : కమ్మర్‌పల్లి అటవీ శాఖ పరిధిలోని ఎర్గట్ల చౌరస్తా వద్ద అటవీశాఖ అధికారులు బుధవారం రోజున ఆరు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. ఎఫ్ఆర్వో అరుణ్ కుమార్ ఆదేశాల మేరకు అటవీ సిబ్బంది తెల్లవారుజామున తనిఖీలు చేపట్టగా,ఇబ్రహీంపట్నం నుంచి ఎర్రట్ల వైపు ఎలాంటి అనుమతులు లేని వేప, మామిడి, మోదుగ కట్టెలను ట్రాక్టర్లలో తరలిస్తుండగా పట్టుకున్నారు.స్వాధీనం చేసుకున్న కట్టెల విలువ సుమారు రూ.ఒక లక్ష వరకు ఉంటుందని ఎఫ్ఆర్వో తెలిపారు. అనంతరం వాటిని కమ్మర్‌పల్లి అటవీ రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు వెల్లడించారు. ఈ తనిఖీల్లో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు శ్రీనివాస్, చంద్రమౌళి పాల్గొన్నారు.

పెన్షన్ల పేరుతో ప్రజలను మభ్యపెట్టి, మోసం చేస్తున్న ప్రజా ప్రభుత్వం

పెన్షన్ల పండుగ' పేరుతో కొద్ది మందికి పాత 2000 ఇస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోంది.

నిజామాబాద్ జిల్లాలో అదనంగా పెరిగిన పెన్షన్లు కేవలం 3,424 మాత్రమే.

చనిపోయిన వారి స్థానంలో కొత్తవారికి ఇస్తూ 'పెన్షన్ల పండుగ' పేరుతో ప్రచార ఆర్భాటం

రూ. 4 వేల పెన్షన్ హామీ, మహిళలకు 2500, తులం బంగారం ఏమైంది?

గణాంకాలు తప్పని నిరూపిస్తే రాజీనామాకు సిద్ధం.. మంత్రులు సీతక్క, సుదర్శన్ రెడ్డి, పీసీసీ చీఫ్ సిద్ధమా?

మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల రెడ్డి



నిజామాబాద్ ప్రతినిధి , బతుకమ్మ:రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 'పెన్షన్ల పండుగ' పేరుతో మంత్రులు, ఎమ్మెల్యేలను మండలాలు, గ్రామాలకు పంపిస్తూ ప్రజలను మభ్యపెట్టే, మోసం చేసే కార్యక్రమాలకు పాల్పడుతోందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నిజామాబాద్ జిల్లా బీయర్ ఎస్ పార్టీ ఆఫీస్ లో బుధవారం నిర్వహించిన ప్రెస్ మీట్ లో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ గణాంకాలు, ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీల వీడియో క్లిప్పింగ్‌లను ప్రదర్శిస్తూ ప్రభుత్వ తీరును ఎండగట్టారు.గత మూడు సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం ఒక్క కొత్త పెన్షన్ కూడా మంజూరు చేయలేదని ఆయన విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ డేటా ప్రకారం, 2023 డిసెంబర్ నాటికి కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నిజామాబాద్ జిల్లాలో 2,79,177 మందికి నెలకు రూ. 2,000 చొప్పున పెన్షన్ అందేదని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మరణాలు, ఇతర కారణాలతో 17,131 మందిని పెన్షన్ జాబితా నుండి తొలగించి, ఇప్పుడు కొత్తగా 20,555 మందికి మంజూరు చేస్తున్నట్లు ప్రకటించిందని తెలిపారు. అంటే తొలగించిన వారి స్థానంలోనే కొత్తవారిని భర్తీ చేయడం ద్వారా, గత ప్రభుత్వ సంఖ్య కంటే జిల్లాలో నికరంగా అదనంగా పెరిగిన పెన్షన్లు కేవలం 3,424 (ఒక శాతం కంటే తక్కువ) మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. చేనేత, గీత కార్మికులు, ఒంటరి మహిళలకు కొద్ది సంఖ్యలో కొత్త పెన్షన్లు ఇవ్వడం సంతోషకరమే అయినప్పటికీ, మెజారిటీ పెన్షన్లు చనిపోయిన వారి స్థానంలోనే ఇచ్చారని పేర్కొన్నారు. కేవలం 3,424 మందికి అదనంగా పెన్షన్లు ఇస్తూ, 31 మండలాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు మీటింగ్‌లు పెట్టి 'పెన్షన్ల పండుగ' పేరుతో ప్రచార ఆర్భాటం చేయడం ప్రజలను వంచించడమేనని మండిపడ్డారు.ఆ మీటింగ్ ల కోసం ఖర్చు పెట్టె ప్రజల డబ్బు పెన్షన్ ల కయ్యే డబ్బుల కంటే ఎక్కువ అవుతుందని ఎద్దేవా చేసారు. భీమ్ గల్ మండలంలోని బెజ్జోర గ్రామంలో 22 మంది పెన్షన్లు తొలగించి కొత్తగా 13 మందికి మాత్రమే ఇస్తూ, గ్రామ పంచాయతీ వద్ద పెద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలని డీపీఓ, సర్పంచ్ కార్యదర్శికు ఆదేశాలు జారీ చేయడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. తాను వెల్లడించిన ప్రభుత్వ అధికారిక గణాంకాలలో ఏ ఒక్కటి తప్పని నిరూపించినా తన ఎమ్మెల్యే పదవికి తక్షణమే రాజీనామా చేస్తానని ప్రశాంత్ రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు. ఒకవేళ తాను చెప్పిందే నిజమైతే జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి సీతక్క, జిల్లా మంత్రి సుదర్శన్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తమ పదవులకు రాజీనామా చేసేందుకు సిద్ధమా అని ప్రశ్నించారు. గత మూడేళ్లుగా నిజామాబాద్ జిల్లాలో వితంతువులు, ఒంటరి మహిళలతో పాటు 57 ఏళ్లు నిండిన సుమారు 40 వేల మంది వృద్ధులు, కొత్తగా పెళ్లె కాపురానికి వచ్చిన సుమారు 30 వేల మంది బీడీ కార్మిక మహిళలు ఆసరా పెన్షన్ల కోసం ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. వీరితో పాటు 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ. 2,500 ఇస్తామన్న మహాలక్ష్మి హామీ కోసం జిల్లాలో సుమారు 2.5 లక్షల మంది ఆడబిడ్డలు నిరీక్షిస్తున్నారని, మొత్తంగా జిల్లాలో దాదాపు 3.20 లక్షల మంది కొత్త పెన్షన్లు, ఆర్థిక సహాయం కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు.వృద్ధులకు, బీడీకార్మికులకు, మహిళలకు ఇచ్చిన హామీలు పూర్తిగా నెరవేర్చినాకే 'పెన్షన్ల పండుగ' నిర్వహించాలన్నారు.ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చిన తర్వాతే 'పెన్షన్ల పండుగ' నిర్వహించుకోవాలని వేముల సూచిస్తూ ప్రభుత్వానికి పలు ప్రధాన డిమాండ్లు చేశారు. అధికారంలోకి రాగానే రూ. 4,000 పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చి 36 నెలలు గడిచినా, నేటికీ పాత రూ. 2,000 మాత్రమే ఇస్తూ ప్రభుత్వం పేదలకు నెలకు రూ. 2,000 చొప్పున బాకీ పడిందన్నారు . జిల్లాలోని 2,79,177 మంది పాత లబ్ధిదారుల ఖాతాల్లో 36 నెలల బకాయి రూ. 72,000 చొప్పున జమ చేసి, ఇప్పటినుండి పాత, కొత్త లబ్ధిదారులందరికీ రూ. 4,000 పెన్షన్ అందించాలన్నారు.జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 40 వేల మంది వృద్ధులకు, 30 వేల మంది బీడీ కార్మిక మహిళలకు వెంటనే రూ. 4,000 కొత్త పెన్షన్లు మంజూరు చేయాలన్నారు.18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ. 2,500 ఇస్తామన్న హామీ మేరకు, జిల్లాలోని 2.5 లక్షల మంది అర్హులైన మహిళలకు 36 నెలల బకాయి రూ. 90,000 చొప్పున చెల్లించి, ఈ నేల నుండి క్రమం తప్పకుండా రూ. 2,500 అందించాలన్నారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద రూ. 1,00,000తో పాటు తులం బంగారం ఇస్తామన్న హామీ మేరకు, గత మూడేళ్లలో జిల్లాలో వివాహమైన సుమారు 20,000 నుండి 25,000 మంది ఆడబిడ్డలకు తులం బంగారం!అందజేయాలి. ఈ హామీలు, బకాయిలన్నీ చెల్లించకుండా కేవలం చనిపోయిన వారి స్థానంలో కొద్దిమందికి పెన్షన్లు ఇస్తూ పండుగ పేరుతో సమావేశాలు నిర్వహిస్తే జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి సీతక్క, మంత్రి అని చెప్పుకుంటున్న సుదర్శన్ రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ప్రజలే ఎక్కడికక్కడ నిలదీసి తగిన బుద్ధి చెబుతారని ఎమ్మెల్యే వేముల హెచ్చరించారు. ఈ ప్రెస్ మీట్ లో బాజిరెడ్డి జగన్,నూడా మాజీ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, మాజీ ఏ ఎం సీ చైర్మన్ దొంకంటి నర్సయ్య,మాజీ ఎంపిపి ఆర్మూర్ మహేష్, ,దండు శేఖర్, సుజిత్ సింగ్ ఠాకూర్,సత్య ప్రకాష్,సిర్ప రాజు,నవీద్, డోళ్ళ రాజేశ్వర్, ఏనుగు గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత, చట్టబద్ధమైన వలసలపై అవగాహన



నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : విదేశాలకు ఉపాధి, ఉద్యోగాల కోసం వెళ్లే కార్మికులు, యువతకు సురక్షితమైన, చట్టబద్ధమైన వలస విధానాలపై అవగాహన కల్పించే దుకు జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తు న్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. వలస సమయంలో ఎదురయ్యే మోసపూరిత, అక్రమ రిక్రూ ట్‌మెంట్, మానవ అక్రమ రవాణా, వెట్టి చాకిరీ, వేతనాల చెల్లింపులో మోసాలు తది తర సమస్యల నుంచి అప్రమత్తంగా ఉండేందుకు అవసరమైన సూచనలు, చట్టపరమైన అంశాలపై ఈ కార్యక్రమంలో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.ఈ నెల19న ఉదయం 11:30 గంటలకు నిజామాబాద్‌లోని సమీక్షత జిల్లా కార్యాలయాల సముదాయంలో అవగాహన కార్యక్రమం ఉంటుందని అన్నారు. విదేశీ ఉపాధికి వెళ్లాలని భావిస్తున్న యువత, కార్మికులు, ఆసక్తి గల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

మా ఆయన్ని మన దేశానికి రప్పించండి..!

11 ఏళ్లుగా ఇరాక్‌లో చిక్కుకున్నాడు



వేల్పూర్, బతుకమ్మ : పొట్టకూటికోసం కానిరాని దేశం వెళ్లి 11 యేండ్లుగా అక్కడే చిక్కుకుపోయిన మా ఆయన్ని మన దేశానికి రప్పించాలని ఓ వివాహిత అధికారులకు విజ్ఞప్తి చేసింది. వివరాల్లోకి వెళ్తే నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలం అక్కూర్ గ్రామానికి చెందిన జిన్నా మల్లన్న గల్ఫ్ దేశం ఇరాక్ లో గత 11 సంవత్సరాలుగా చిక్కుకుపోయాడు.అక్కడ అప్పు కోసం పాస్‌పోర్టును తాకట్టు పెట్టడంతో స్వదేశానికి తిరిగి వచ్చేందుకు నానా ఇబ్బందులు పడుతున్న తన భర్తకు అధికారులు అండగా నిలువలని ఆమె కోరింది.ఆయనను సురక్షితంగా స్వదేశానికి తీసుకువచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ఆయన భార్య హంస విజ్ఞప్తి చేశారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇరాక్‌లో ఒక వ్యక్తి వద్ద తన పాస్‌పోర్టును తాకట్టు పెట్టి మల్లన్న అప్పు తీసుకున్నారని ఆమె తెలిపారు. అయితే, తీసుకున్న అప్పును తిరిగి చెల్లించలేకపోవడంతో పాస్‌పోర్టును తిరిగి పొందలేకపోతున్నారని, దీంతో భారత్‌కు తిరిగి రావడానికి మార్గం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తన భర్త ఇరాక్‌లో ఉండిపోవడంతో ఇద్దరు కుమార్తెల పోషణ, చదువుల బాధ్యత తనపై పడిందని, ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని హంస వాపోయింది . తన భర్తను వీలైనంత త్వరగా స్వదేశానికి రప్పించి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఆమె కోరారు.ఈ నేపథ్యంలో ఇటీవల హైదరాబాద్‌లోని బేగంపేట మహాత్మా జ్యోతిబా ఫూలే ప్రజాభవన్‌లో నిర్వహిస్తున్న 'సీఎం ప్రవాసీ ప్రజావాణి' వేదికను హంస సందర్శించింది. ఈ మేరకు రాష్ట్ర నోడల్ అధికారి కె. విద్యాసాగర్, తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై అడ్వైజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డిని కలిసి తన భర్త పరిస్థితిని వివరించింది.ఈ సమస్యపై స్పందించిన వారు , తెలంగాణ ప్రభుత్వం తరఫున ఇరాక్‌లోని భారత రాయబార కార్యాలయానికి లేఖ రాసి, జిన్నా మల్లన్న పాస్‌పోర్టు సమస్యను పరిష్కరించి న్యాయ, దౌత్యపరమైన సహకారం అందించి ఆయనను స్వదేశానికి తీసుకువచ్చేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

వాసవి అన్నసత్రం ఆధ్వర్యంలో పులిహోర పంపిణీ

భీమ్ గల్, బతుకమ్మ : లింబాద్రిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని వాసవి అన్నసత్రం ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా పులిహోర పంపిణీ చేయనున్నారు . గత యేడు మాదిరిగా గురువారం ఉదయం 10 గంటలకు భీమ్ గల్ బస్టాండ్ వద్ద ఆర్యవైశ్య సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.స్వామివారి కల్యాణ మహోత్సవానికి వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తులకు అన్నప్రసాదం అందించాలనే ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. భక్తులు, ప్రజలు కార్యక్రమంలో పాల్గొని సహకరించాలని వాసవి అన్నసత్రం నిర్వాహకులు కోరారు.

ఇద్దరు ఏడిఈలకు బదిలీ

ఇందూర్, బతుకమ్మ: నిజామాబాద్ సర్కిల్ పరిధిలో ఇద్దరు ఏడిఈ లను బదిలి చేస్తూ కంపనీ సిఎండి వరుణ్ కుమార్ ఉత్తర్వులు జారి చేసారు. నందిపేట్ ఏడిఈ గా విధులు నిర్వహిస్తున్న అశోక్ ను డిచ్ పల్లి కి బదిలీ చేసారు. భీంగల్ ఏడిఈ గా ఉన్న రాజేందర్ రెడ్డి ని నందిపేట్ కు బదిలీ చేసారు. 19న బదిలీ బాధ్యతలను తీసుకోనున్నారు.

అక్రమ మొరం తవ్వకాలపై ఆటవిశాఖ చర్యలు...

ఆటవిశాఖ పరిధిలో తవ్వకాలు చేపట్టవద్దు

ఇందల్వాయి ఫారెస్ట్ రేంజ్ అధికారి రవి మోహన్ బట్



ఇందల్వాయి బతుకమ్మ : ఇందల్వాయి మండలంలోని తిరుమయ్య తండాలో ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా మొరం తవ్వకాలను నిర్వహించిన వ్యక్తిపై ఆటవి చట్టం ప్రకారం కేసు నమోదు చేసి జరిమాన విధించడం జరిగిందని ఇందల్వాయి ఆటవి రేంజ్ అధికారి రవి మోహన్ బట్ తెలిపారు, ఇందల్వాయి సెక్షన్ అధికారి ప్రభాకర్ ఆధ్వర్యంలో గన్నారం బీట్ అధికారి వందన తో కలిసి తనిఖీ చేయగా తిరుమలయ్య తాండ పరిధిలో దేగావత్ గంగారం ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి ఆటవి ప్రాంతంలో మొరం తవ్వకాలు నిర్వహిస్తున్నారని తెలిసి అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇందల్వాయి ఆటవి రేంజ్ అధికారి రవి మోహన్ బట్ వివరించారు, ప్రభుత్వ అనుమతులకు విరుద్ధంగా మొరం తవ్వకాలు నిర్వహించినందుకు ?9945 రూపాయల జరిమానా విధించిన జరిగిందని ఆయన తెలిపారు, ఎవరైనా ఆటవి ప్రాంతంలో అక్రమంగా మొరం తవ్వకాలు నిర్వహించిన, వన్య ప్రాణుల వేట కొనసాగించిన, చెట్టును నరికిన చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు

కళ్యాణం చూద్దాం రారండీ..!

నేడు శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం.



భీమ్‌గల్, బతుకమ్మ :అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు, కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణ మహోత్సవం నేడు వైభవంగా నిర్వహించనున్నారు. స్వామి కల్యాణమహోత్సవానికి లింబాద్రిగుట్ట ముస్తాబైంది.లోక కల్యాణార్థం లోక రక్షకుడైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారు, శ్రీ మహాలక్ష్మీ అమ్మవారిని పరిణయమాడే ఈ పుణ్య ఘట్టాన్ని కనులారా వీక్షించేందుకు భక్తులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని నూతన కల్యాణ మండపంలో అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త నంబి పార్థసారథి కుటుంబ సభ్యులు, అర్చక బృందం అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.వేదమంత్రాల నడుమ మంగళ వాయిద్యాల శుభనాదాలతో, మంగళ అక్షింతలు, మాంగల్యధారణ వంటి సంప్రదాయబద్ధమైన వైదిక కార్యక్రమాలతో స్వామివారి కల్యాణ వేడుక భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని పంచనుంది. స్వామివారి దివ్య కల్యాణాన్ని దర్శించుకుంటే సకల శుభాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం.ఈ అపురూప ఆధ్యాత్మిక ఘట్టాన్ని తిలకించేందుకు భీమ్ గల్ ప్రాంతంతో పాటు చుట్టుపక్కల గ్రామాలు, వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు లింబాద్రిగుట్టకు తరలిరానున్నారు. స్వామివారి కల్యాణ మహోత్సవంతో లింబాద్రిగుట్ట ఆధ్యాత్మిక శోభను సంతరించుకోనుంది. భక్తుల గోవింద నామస్మరణలు, స్వామివారి నామసంకీర్తనలతో గుట్ట పరిసరాలు మార్మోగనున్నాయి.